ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

బుధవారం 9 ఏప్రిల్ 2025





సింహగిరిపై కోలాటం ఆడుతున్న మహిళలు

అంగరంగ వైభవంగా అప్పన్న కల్యాణం

కన్నుల పండువగా ఎదురు సన్నాహోత్సవం

- సందడిగా సాగిన స్వామివారి రథోత్సవం
- భక్తుల హరి నామస్మరణతో మార్మోగిన సింహగిరి



అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవంలో తలంబ్రాలు చూపిస్తున్న అర్చకులు

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తుల హరి నామస్మరణతో సింహగిరి మార్మోగింది. అంతకుముందు కల్యాణానికి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం, ఎదురు సన్నాహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లు ప్రత్యేక రథంపై మాడ వీధుల్లో విహరించారు. రాత్రి పది గంటలకు ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అధిష్ఠింపజేసి అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును జరిపించారు. మాంగళ్యధారణ, జీలకర్ర, బెల్లం తదితర ఘట్టాలను ప్రత్యక్షంగా వీక్షించిన భక్తజనం తరించింది.

- వివరాలు 8వ పేజీలో



కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం

నేడు మంత్రి నారా లోకేష్ రాక



విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం విశాఖపట్నం రానున్నారు. సాయంత్రం 7.45 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్న ఆయన రోడ్డు మార్గంలో పార్టీ కార్యాలయానికి వెళతారు. అక్కడే రాత్రి బస చేస్తారు. మరుసటిరోజు (గురువారం) ఉదయం 10.15 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి జిల్లా కోర్టుకు వెళతారు. తనపై తప్పుడు కథనం ప్రచురించిందని 'సాక్షి' దినపత్రికపై ఆయన గతంలో పరువు నష్టం దావా వేశారు. ఆ కేసు విచారణకు ఆయన హాజరుకానున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు కోర్టు నుంచి బయలుదేరి విమానాశ్రయానికి చేరుకుని విజయవాడకు వెళతారు.

ఎన్‌టిఆర్ వైద్య సేవలు పునఃప్రారంభం

- సమ్మె విరమించిన నెట్‌వర్క్ ఆస్పత్రులు

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):

నెట్‌వర్క్ ఆస్పత్రులు మంగళవారం నుంచి యథావిధిగా 'ఎన్‌టీఆర్ వైద్య సేవ'లు అందించాయి. నెట్‌వర్క్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు 108 ఉండగా... వాటిలో 27 ఆస్పత్రులు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సేవలు నిలిపివేశాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లోని ఆస్పత్రులు సేవలను నిలిపివేయడంతో సోమవారం రాత్రి ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులతో ఆరోగ్య శాఖ అధికారులు చర్చలు జరిపారు. ఈ మేరకు ఆస్పత్రులకు బకాయిల నిమిత్తం ప్రభుత్వం రూ.500 కోట్లు విడుదల చేసింది. అందులో జిల్లాలోని ఆస్పత్రులకు సుమారు రూ.50 నుంచి 80 కోట్లు వరకూ వస్తుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి అన్ని ఆస్పత్రులు ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకంలో భాగంగా సేవలను అందించాయి.

కిలేడీ

- తక్కువ ధరకే స్థలాల పేరుతో మోసం
- నగరంలోని వివిధ ప్రాంతాల్లో బాధితులు
- భీమిలి వాసి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):

ఆదాయ పన్ను అధికారినని, చాలా ధనవంతురాలినని, తన సొమ్ము రూ.వంద కోట్లు సీబీఐ స్వాధీనం చేసుకుందని కథలు అల్లుతూ ఓ కి'లేడీ' జనాన్ని మోసగించింది. భీమిలి, పెందుర్తి, తగరపువలస, మద్దిలపాలెం తదితర ప్రాంతాల్లో ఈమె పలువురిని మోసం చేసినట్టు తెలిసింది. భీమిలి సంగివలస కాలనీకి చెందిన అత్తిలి తరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఆమెపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదుచేశారు. సీఐ మురళి తెలిపిన వివరాలిలా ఉన్నాయి...

భీమిలిలోని తరుణ్‌కుమార్ ఇంటి పక్కన 2020లో ... మిగతా 6వ పేజీలో

విశ్వనాథ్ అడ్వంచర్స్ అరాచకం

అడుగడుగునా లోపాలు.. కానరాని భద్రతా చర్యలు

- కేర్ టేకర్లు లేరు
- ఆక్వా స్పోర్ట్సులో లైఫ్ గార్డ్సు నిల్
- అగ్ని ప్రమాదం సంభవిస్తే అదుపుచేసే యంత్రాంగం లేదు
- ఏడేళ్ల బాలుడి మృతితో బయటపడిన నిర్వహణ వైఫల్యం
- జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఫిర్యాదు
- అధికారుల బృందం పరిశీలన
- తాత్కాలికంగా అడ్వంచర్ స్పోర్ట్స్ నిలిపివేత



విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో స్విమ్మింగ్‌పూల్. (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన బాలుడు రిషిత్



పోర్ట్ స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ ముఖద్వారం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని పోర్టు స్టేడియం (అక్కయ్యపాలెం)లో నిర్వహిస్తున్న విశ్వనాథ్ అడ్వంచర్స్ స్పోర్ట్స్‌లో భద్రత ఎంత?...అనే దానిపై ఇప్పుడు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోర్టు నుంచి లీజుకు తీసుకున్న స్టేడియంలో ఇటీవల అనేక రకాల అడ్వంచర్ స్పోర్ట్స్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఆక్వా స్పోర్ట్స్‌కు వెళ్లిన ఏడేళ్ల బాలుడు రుషి సోమవారం సాయంత్రం నీటిలో మునిగి మృతిచెందాడు. ఈ విషయం బయటకు పొక్కకుండా చేయడానికి అడ్వంచర్ స్పోర్ట్సు నిర్వాహకులు, పోలీసులు యత్నించారు. ఆ కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చారని సమాచారం. అయితే ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు ఈ అడ్వంచర్ స్పోర్ట్స్‌కు సంబంధించి ఇప్పటికే చేదు అనుభవాలు ఉండడంతో తీవ్రంగా స్పందించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఆయన విచారణకు ఆదేశించారు.

పర్యాటక శాఖ అధికారులు, విశాఖ అర్బన్ తహసీల్దార్, పోలీసు అధికారులు కలిసి వెళ్లి పరిశీలించి ప్రాథమిక నివేదిక అందజేశారు. అడ్వంచర్ స్పోర్ట్స్‌ను తక్షణమే ఆపేయాలని ఆదేశించారు. రెస్టారెంట్, ఇండోర్ గేమ్స్, బాక్స్ క్రికెట్ వంటివి నిర్వహించుకోవచ్చునని, మళ్లీ చెప్పేంత వరకు అడ్వంచర్ స్పోర్ట్ నడపకూడదని స్పష్టం చేశారు.

ఎన్నో రకాలు..?

విశ్వనాథ్ స్పోర్ట్స్ పేరుతో గో కార్టింగ్, జిప్ లైనర్, స్విమ్మింగ్, ఆక్వా స్పోర్ట్స్, స్నో వరల్డ్...ఇలా అనేకం ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఏది చేసినా భారత ప్రమాణాల (ఇండియన్ స్టాండర్డ్) కోడ్ ... మిగతా 6వ పేజీలో

విశ్వనాథ్ అడ్వంచర్ స్పోర్ట్స్‌లో భద్రత శూన్యం

- అందుకే అక్కడకు వెళ్లిన పిల్లలు ప్రమాదాలకు గురవుతున్నారు
- లీజు నిబంధనలను తరువాత సవరించినట్టు తెలిసింది
- పోర్టు చైర్మన్‌తో మాట్లాడతా
- సీబీఐతో విచారణ చేయించాలి
- 'నార్త్' ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పోర్టు స్టేడియంలో నిర్వహిస్తున్న విశ్వనాథ్ అడ్వంచర్ స్పోర్ట్స్‌లో సరైన భద్రత చర్యలు కానరావడం లేదని, అందువల్ల దానిని తక్షణమే మూసివేయాలని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు డిమాండ్ చేశారు. ఆక్వా స్పోర్ట్స్‌కు వెళ్లిన రుషి అనే ఏడేళ్ల బాలుడు సోమవారం సాయంత్రం మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మంగళవారం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడికి వెళ్లిన



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

విష్ణుకుమార్‌రాజు విలేకరులతో మాట్లాడారు. స్టేడియాన్ని పోర్టు నుంచి లీజుకు తీసుకున్న విశ్వనాథ్ కన్వెన్షన్స్ ఆ తరువాత అక్కడ అడ్వంచర్ స్పోర్ట్స్ ప్రారంభించిందన్నారు. స్టేడియాన్ని లీజుకు తీసుకున్నప్పుడు ఉన్న నిబంధనలను ఆ తరువాత సవరించారని తెలిసిందని, దీనిపై తాను పోర్టు చైర్మన్‌తో మాట్లాడతానన్నారు. అవసరమైతే సీబీఐకి ఫిర్యాదు చేసి విచారణ కోరతామన్నారు. అక్కడ అడ్వంచర్ స్పోర్ట్స్‌లో కనీస భద్రత చర్యలు లేవని ఆయన ఆరోపించారు. గత ఏడాది మే నెలలో తన మనవరాళ్లు ఇద్దరు అక్కడికి గో కార్టింగ్‌కు వెళ్లగా, వారిలో ఒకరు ప్రమాదానికి ... మిగతా 6వ పేజీలో

బాలుడిని బలిగొన్న ఈతకొలను

విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో దారుణం

- ఘటనపై పోలీసుల గోప్యత!
- స్టేషన్ ఆవరణలోనే సెటిల్‌మెంట్?
- విచారణకు రంగంలోకి దిగిన సీపీ

విశాఖపట్నం/సీతంపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):

పోర్టు స్టేడియంలో గల విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ ఆక్వా వరల్డ్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో సోమవారం సాయంత్రం ఏడేళ్ల బాలుడు రిషిత్ సాయి శ్రీకర్ మృతిచెందాడు. అక్కడ కేర్ టేకర్ లేకపోవడంతో స్విమ్మింగ్ పూల్‌లో బాలుడు మునిగిపోయినట్టు చెబుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

మురళీనగర్ ఎన్‌జీఓఎస్ కాలనీకి చెందిన వాసుపల్లి గారగారావు అలియాస్ గంగాధర్ తన భార్య, కుమారుడు రిషిత్ సాయి శ్రీకర్ (7), తన చెల్లెలి పిల్లలతో కలిసి సోమవారం సాయంత్రం పోర్టు స్టేడియంలో విశ్వనాథ్ ఆక్వా వాటర్ వరల్డ్‌కు వెళ్లారు. పిల్లలు ఒక్కొక్కరికి రూ.800 చొప్పున రూ.2,400 పెట్టి మూడు టికెట్లు కొని వారిని లోపలకు పంపించారు. తల్లిదండ్రులు బయట ఉండి చూస్తున్నారు. కొద్దిసేపటికి కాఫీ తాగడానికి వారిద్దరూ పక్కకు వెళ్లారు. వారు తిరిగి వచ్చేసరికి ఏడేళ్ల కుమారుడు రిషిత్ కనిపించలేదు. అక్కడి వారిని అడిగితే నీటిలో మునిగిపోయాడని, సమీపానున్న ఎస్ఆర్ఐ ఆస్పత్రికి బైక్‌పై తీసుకువెళ్లారని చెప్పారు. దాంతో పరుగు పరుగున ఆస్పత్రికి వెళ్లారు. అయితే అప్పటికే బాలుడు మరణించాడని ఆస్పత్రి వర్గాలు స్పష్టంచేశాయి. సమాచారం అందుకున్న నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేయడంలో తాత్సారం చేయడంతోపాటు, విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. సోమవారం రాత్రి బాలుడు మృతి చెందినప్పటికీ గోప్యంగా ఉంచారు. పోలీస్ స్టేషన్ ఆవరణలోనే నిర్వాహకులతో ... మిగతా 6వ పేజీలో

ఖాకీ వసూల్

మద్యం దుకాణాలు, బార్ల నుంచి నెలవారీ మామూళ్లు

- వైన్‌షాపునకు రూ.5వేలు నుంచి రూ.8వేలు
- బార్‌కు రూ.7,500 నుంచి రూ.పది వేలు
- దాదాపు అన్ని పోలీస్ స్టేషన్లలోనూ ఇదే తంతు
- పోలీస్ శాఖలో ప్రత్యేక విభాగానికి రూ.2,000
- సీపీకి దృష్టికి వెళ్లకుండా మేనేజ్ చేస్తున్న మధ్యస్థాయి అధికారులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ అంటే ఇంతవరకూ భయంతో ఉన్న పోలీసులు...క్రమంగా జూలు విదుల్చుతున్నారు. గతంలో మాదిరిగా స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లు, స్క్రాప్ దుకాణాలు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల నుంచి మామూళ్ల వసూళ్లపై దృష్టిసారించారు. ఇప్పటికే స్క్రాప్ దుకాణాల నుంచి క్రైమ్ విభాగం పోలీసులు మామూళ్లు గుంజుతుండగా, బార్లు, మద్యం దుకాణాల నుంచి నెలవారీ వసూళ్లకు శాంతి భద్రతల విభాగం పోలీసులు గత నెలలో శ్రీకారం చుట్టారు. బార్‌కు ఇంత...వైన్‌షాప్‌కు ఇంత... అంటూ దుకాణం ఉన్న ప్రాంతాన్ని బట్టి రేట్లు నిర్ణయించారు. ఈ విషయం సీపీ దృష్టికి చేరకుండా మధ్యస్థాయి అధికారులు కొందరు కప్పిపుచ్చుతున్నారు.

సీపీ శంఖబ్రతబాగ్చికి ముక్కుసూటి అధికారిగా గుర్తింపు ఉండడంతో ఆయన రాకముందు నగరంలో పోస్టింగ్ కోసం ఆసక్తి చూపినవారంతా వెనకడుగు వేసి రేంజ్‌లోనే ఉండిపోయారు. నగరంలో పనిచేస్తున్న అధికారులు కూడా ఏ క్షణంలో ఎలాంటి ఇబ్బంది ఎదుర్కొనాల్సి వస్తుందోననే భయంతో నగరం నుంచి రేంజ్‌కు వెళ్లిపోయారు. సీపీ కూడా సిబ్బంది, అధికారులు పారదర్శకంగా పనిచేయాలని, అవినీతికి పాల్పడినా, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు ... మిగతా 6వ పేజీలో

ముగిసిన డిప్యూటీ సీఎం పర్యటన



అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం కురిడి గ్రామంలో మంగళవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్

గోపాలపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండు రోజులు పర్యటన ముగించుకుని మంగళవారం తిరుగు పయనమయ్యారు. ఆయనకు విమానాశ్రయంలో పార్టీ నేతలు, పలువురు అధికారులు వీడ్కోలు పలికారు. మధ్యాహ్నం 1.50 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న పవన్ కల్యాణ్ 2.05 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

వర్షం... సేదతీరిన జనం



విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అనేక ప్రాంతాల్లో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, ఇసుకతోట, బీచ్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో భారీవర్షం కురిసింది. గడిచిన కొద్దిరోజులుగా ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న నగర వాసులకు ఈ వర్షం సాంత్వన చేకూర్చింది. వర్షం తరువాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

పైడితల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం



పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు

భీమునిపట్నం (రూరల్) ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలం సింగనబంద గ్రామంలో గ్రామ దేవత పైడితల్లమ్మ ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా గ్రామంలో అమ్మ వారి ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానికి భక్తులు బారులు తీరారు. దేవాలయ కమిటీ భక్తుల కోసం వివిధ ఏర్పాట్లు చేసింది.

అప్పన్నను దర్శించుకున్న సినీ నటుడు సత్యం రాజేష్



అప్పన్న సన్నిధిలో సత్యం రాజేశ్

సింహాచలం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం సినీ హాస్య నటుడు 'సత్యం' రాజేష్ దర్శించుకున్నారు. ఆలయ కప్పస్తంభ ఆలింగనం చేసుకున్న ఆయన అంతరాలయంలో పూజలు జరిపించారు. గోదాదేవి అమ్మవారిని దర్శించుకున్న తరువాత ఆలయ సిబ్బంది స్వామి ప్రసాదాలను అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆనందపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్లులలో మరమ్మత్తులు చేపడుతున్నందున బుధవారం సరఫరాలో అంతరాయం ఏర్పడనునట్టు ఏఈ నరేష్‌కుమార్ తెలిపారు. చందక, పొడుగుపాలెం, వెంకటాపురం, జగన్నాధపురం, గొట్టిపల్లి, కుసులువాడ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అప్పన్న వార్షిక కల్యాణోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు

సింహాచలం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రినాధుని వార్షికతిరుకల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఆధ్యాత్మికత,ఆహ్లాదాలను అందించేందుకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను సింహాచల దేవస్థానం ఈవో కె.సుబ్బారావు సారథ్యంలో ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బుధవారం సింహగిరిపై స్వామి వారి ప్రధాన రాజగోపురానికి ఆనుకుని ఉన్న కళా వేదికపై సాయంత్రం 4 గంటలకు విజయనగరం ప్రాంతానికి చెందిన అభినయ కళాక్షేత్రం నిర్వాహకురాలు బి.మంజూషా నేతృత్వంలో కూచిపూడి నాట్యాలు, 5 గంటల నుంచి టి.అన్నమాచార్య సేవా ట్రస్టు ప్రతినిధి సునీత ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యాలు, 6 గంటల నుంచి పాత గాజువాకకు చెందిన మాతృశ్రీ సాయి కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలుంటాయి. 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఉషోదయ కూచిపూడి కళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యాలు, 5 గంటలకు నగరానికి చెందిన వి.సాయికుమారి 'నాదనీరాజన' పేరిట అన్నమాచార్య సంకీర్తనల గానం, అన్నమయ్య జానపద కళాక్షేత్రం ప్రతినిధి వై.అప్పారావు సంకీర్తనల గానం ఉంటుంది. 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వారి నాట్యారాధన, కూచిపూడి నృత్యాలు, 6కు విజయనగరం ప్రాంతానికి చెందిన శ్రీహరి సేవా సంస్థ వీవీవీ అరుణ్‌తో కూచిపూడి నాట్యాలు, 12సాయంత్రం 4 గంటలకు అనకాపల్లికి చెందిన సాయిగణేశ్ డ్యాన్స్ అకాడమీ సభ్యులచే, 5 గంటలకు విజయవాడకు చెందిన గాయత్రీ నృత్యనికేతన్ కళాకారులతో, 6కు నగరానికి చెందిన అభినయం సంస్థ కళాకారులతో కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయి. అలాగే 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఖమ్మం ప్రాంతానికి చెందిన అభినయ రుద్ర నాట్యాలయం కళాకారులతో, 5 గంటలకు నటప్రభు అసోసియేషన్ సభ్యులతో కూచిపూడి నాట్యాలు, 6 గంటలకు విజయవాడకు చెందిన నటరాజ నృత్యాలయ సభ్యులతో ఆంధ్రా నృత్య ప్రదర్శనలు ఉంటాయి.

'పాఠశాలల విలీనం తగదు'

ఆనందపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ సంస్కరణల పేరిట పాఠశాలలను విలీనం చేయడం తగదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేద్కర్ పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన కుసులువాడ పంచాయతీ సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి శివాజీకి మెమోరండం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల విలీనం వల్ల పలు సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు.

రాష్ట్రంలోనే మోడల్ టెంపుల్‌గా అప్పన్న ఆలయం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సింహాచలం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే ఒక మోడల్ టెంపుల్‌గా సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రాన్ని తీర్చిదిద్దాలని సంకల్పించినట్టు భీమిలి శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు అన్నారు. స్వామి వారి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి జరిగిన రథోత్సవంలో ఆయన పాల్గొని రథానికి కొబ్బరికాయ కొట్టి, స్వయంగా రథం తాడును లాగారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహగిరికి దర్శనానికి వచ్చే భక్తులకు చక్కని అనుభూతి మిగిలేలా వాతావరణాన్ని కల్పించాలని, అందుకు తగ్గట్టు మాస్టర్‌ప్లాన్ తయారు చేసేందుకు త్వరలో దేవదాయ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. అలాగా ఈనెల 30న జరుగనున్న సింహాద్రి నాథుడి నిజరూప దర్శనం చందనోత్సవాన్ని పురస్కరించుకుని గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, నాటి వైఫల్యాలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దేవదాయశాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. దేవదాయశాఖ సిబ్బంది పలువురు అభిప్రాయాల మేరకు చందనోత్సవ వేళ ప్రముఖులకు ప్రాధాన్యతమిస్తూనే సామాన్య భక్తులకు



ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పెద్దపీట వేయాలని యోచిస్తున్నామన్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈనెల 15న దేవదాయశాఖ మంత్రి ఆనం రామ్‌నారాయణరెడ్డి సారథ్యంలో మంత్రుల కమిటీ చందనోత్సవ నిర్వహణపై సమావేశమై విస్తృతంగా చర్చించనుందన్నారు. అనంతరం సింహాద్రినాథుడిని గంటా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో పాటు మహా విశాఖ 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం కూడా ఉత్సవంలో పాల్గొన్నారు.

మేలోగా అనంతుని ఆలయ పునర్నిర్మాణ పనులను పూర్తి చేయాలి

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పద్మనాభం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభుని ఆలయ పునర్నిర్మాణ పనులను మే మొదటి వారం నాటికి పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం ఆయన అనంత పద్మనాభుని ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పనులు చాలా ఆలస్యంగా సాగాయని, ఆలయ ప్రహరీ, ఇతర పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఆలయ ధ్వజస్తంభాన్ని కూడా చేయించాలని ఈవోకు సూచించారు. అలాగే రెడ్డిపలి-పద్మనాభం రోడ్డు విస్తరణ పనులను, సైడ్ కాలువలను, ఇతర పెండింగ్ పనులను పూర్తి చేసి పది రోజుల్లో ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా గిరిపై నుంచి కనిపిస్తున్న కృష్ణాపురం గ్రామంలోని కొండ ప్రాంతంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూములను, సోలార్ పార్కుకు కేటాయించిన భూముల వివరాలను తహశీల్దార్ ఆనందరావు ఎమ్మెల్యేకు వివరించారు. ఆలయ అర్చకులు గంటాకు వేదాశీర్వచనాలను అందజేశారు.



అధికారులకు సూచనలిస్తున్న గంటా శ్రీనివాసరావు

ఆయన వెంట ఎంపీడీవో విజయకుమార్, ఈవో నానాజీబాబు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ గాడు వెంకటప్పడు, టీడీపీ నాయకులు రమణ, దామోదరరావు, నగేశ్‌కుమార్, నందీశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, బీజేపీ మండల అధ్యక్షురాలు నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ మొదటి ఏడాది ఫలితాల్లో 'కృష్ణా' ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న లెక్చరర్లు

భీమునిపట్నం (రూరల్) ఏప్రిల్ 08 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ మొదటి ఏడాది సెమిస్టరు ఫలితాల్లో స్థానిక కృష్ణా కళాశాలకు చెందిన దల్లి రామశ్రీను 10 పాయింట్లకు 9.05 పాయింట్లు సాధించి మొదటి ర్యాంకులో నిలిచినట్టు కళాశాల ఛైర్మన్ బి.నర్సింగరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే డి.సరస్వతి 8.85 పాయింట్లు, డి. వరలక్ష్మి 8.60 పాయింట్లు సాధించి తదుపరి స్థానాల్లో నిలిచారని తెలిపారు. 8 పాయింట్లకు పైబడి 50 మంది ఉత్తీర్ణత సాధించినట్టు పేర్కొన్నారు. వీరిని మంగళవారం జరిగిన సమావేశంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. సతీష్‌కుమార్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ కన్నుమూత



పద్మనాభం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాందేవుపురం ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాయి అప్పలస్వామి (85) అనారోగ్యంతో మరణించారు. విలాస్‌ఖాన్‌పాలేనికి చెందిన ఆయన 2006లో ఎంపీటీసీ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. ఆయన మృతి పట్ల పలువురు టీడీపీ, వైసీపీ నాయకులు సంతాపం తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోండి

మండల సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎంపీపీ రాంబాబు ఆదేశం

పద్మనాభం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వేసవి తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉందని, తక్షణమే గ్రామీణ నీటిసరఫరా శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కె. రాంబాబు ఆదేశించారు.



ఉపాధి హామీ పథకం పనులపై నిలదీస్తున్న సభ్యుడు

పద్మనాభంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు అందించే మంచినీటి పథకాలు, బోర్లు నిరంతరం పని చేసే విధంగా అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల పనితీరును ఆయన సమీక్షించారు. ఆయా శాఖల వారీగా ప్రగతి నివేదికలను సమావేశంలో సమర్పించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల సమాచారాన్ని సిబ్బంది ప్రజాప్రతినిధులకు తెలియజేయడం లేదని గంధవరం సర్పంచ్ జీవీకే వర్మ ఫిర్యాదు చేశారు. ఉపాధిహామీ పథకంలో మంజూరై సీసీ రోడ్డు పనులను నేటికీ ప్రారంభించలేదని శేరిఖండం సర్పంచ్ పల్లంటి చిన్నారావు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

సమావేశంలో జడ్పీ వైస్ ఛైర్మన్ ఎస్.గిరిబాబు, వైఎస్ ఎంపీపీ ఈర్లె రాజేశ్వరి, ఎంపీడీవో ఎం.విజయకుమార్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపు విరమించుకోవాలి : సీపీఐ

తగరపువలస, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సామాన్యులకు పెనుభారంగా మారే గ్యాస్ సిలిండర్ల ధర పెంపుదలను నిలిపి వేయాలని సీపీఐ సమావేశం డిమాండ్ చేసింది. మంగళవారం తగరపువలస సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ కార్యదర్శి కానూరి రాంబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికే చాలా ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఇది అదనపు భారంగా ఉందన్నారు. రాయితీ ఇస్తున్నట్టు ప్రకటించినా చాలామంది బ్యాంకు ఖాతాల్లో ఆ రాయితీ మొత్తం జమ చేయడం లేదని, ఇప్పుడు సిలిండర్ ధర పెంచితే మరింత ఇబ్బందిగా తయారవుతుందని అన్నారు. గ్యాస్ వినియోగదారులతో అన్ని ప్రాంతాల్లో ఆందోళన లు చేయడానికి సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, లక్ష్మణరావు, ముత్యాలరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సీపీఐ నేతలు

పీఎంశ్రీ పథకానికి చిట్టివలస జడ్పీ హైస్కూల్ ఎంపిక

అదనపు వనరులను కల్పించేందుకు పాఠశాలను సందర్శించిన సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్

తగరపువలస, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చిట్టివలస జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి ఎంపికైంది. ఈ పథకం కింద అదనపు సదుపాయాలను, అవసరమైన వనరులను పాఠశాలకు కల్పిస్తారు. ఈ మేరకు మంగళవారం సమగ్రశిక్ష అడిషినల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.చంద్రశేఖరరావు ఈ పాఠశాలను సందర్శించారు. క్రీడా స్థలాన్ని అభివృద్ధి చేయడానికి గల అవకాశాలను పరిశీలించారు. పీఎంశ్రీ పథకం కింద రాష్ట్రంలోని కొన్ని పాఠశాలలను మాత్రమే ఎంపిక చేయగా, ఇందులో చిట్టివలస జడ్పీ హై స్కూల్ ఉందన్నారు. పీఎంశ్రీ పథకం కింద ఈ పాఠశాలకు అన్ని వనరులను సమకూరుస్తామని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్, ఇతర సదుపాయాలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా అవసరమైన వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న పరీక్షల నిర్వహణ తీరును చంద్రశేఖరరావు తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై ఆరా తీయడంతో పాటు



క్రీడా స్థలాన్ని పరిశీలిస్తున్న సమగ్రశిక్ష అదనపు సమన్వయకర్త చంద్రశేఖరరావు

నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో సమావేశమై పీఎంశ్రీ పథకం కింద ఎటువంటి వనరులు కావాలో అడిగారు. ఆ తరువాత ఈ పాఠశాలను ఆనుకుని ఉన్న జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను చంద్రశేఖరరావు సందర్శించారు. ఆయన వెంట సర్వశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు రోజామణి, సూర్యనారాయణ, తదితరులు ఉన్నారు.



ఆసనాలు వేస్తున్న విద్యార్థులు, తదితరులు

గీతంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

సాగర్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా 74వ కౌంట్‌డౌన్ డే కార్యక్రమాన్ని మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. విశాఖ ఆయుష్ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఝాన్సీరాణి, గీతం ప్రోవైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, రిజిస్ట్రార్ డి.గుణశేఖరన్, సైకాలజీ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్, కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.సునీత, తదితరులు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో యోగా విలువల గురించి వివరించారు. యోగా శిక్షకురాలు డాక్టర్ స్వప్న, ఐదుగురు యోగా ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రామాస్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రవీంద్రనాథ్, సుమారు ఆరు వందల మంది విద్యార్థులు, నేవీ, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఆయుష్ శాఖ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాగుల కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోండి

పద్మనాభం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాగుల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని తమ పంటకు గిట్టుబాటు ధర పొందాలని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలత అన్నారు. మండలంలోని మద్ది రైతు సేవా కేంద్రంలో మంగళవారం రాగుల కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాగులకు క్వింటాకు రూ.4,290 మద్దతు ధర చెల్లిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి, సేంద్రీయ వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఎ.మోహనరావు, ఎంపీపీ కె.రాంబాబు, వ్యవసాయశాఖ ఏడీ విజయప్రసాద్, ఏవో చలం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు పనులను నిలిపివేయాలని సీపీఎం ఆందోళన

ఆనందపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములవలస పంచాయతీ పరిధిలోని భీమిలి క్రాస్ రోడ్డు నుంచి గొల్లలపాలెం వరకు చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ మెట్రోపాలిటన్ రీజినల్ డెవలప్‌మెంట్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా భీమిలి క్రాస్ రోడ్డు నుంచి గొల్లలపాలెం వరకు 200 అడుగుల రోడ్డు వెడల్పు చేయడం వల్ల బొడ్డపాలెం, గారిపేట, మన్యాలపేట, గొల్లలపాలెం, తదితర గ్రామాలకు చెందిన సుమారు 150 కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. అనంతరం వినతిపత్రాన్ని డీటీ ఎల్.చేతన్‌కుమార్‌కు అందజేశారు.

కానరాని జీవీఎంసీ చలివేంద్రాలు

కొమ్మాది, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వేసవి ప్రారంభమైంది. మార్చి నెల నుంచే ఎండలు ఠారెత్తిస్తున్నాయి.ఈనేపథ్యంలో జీవీఎంసీ ఏటా నగరంలోని ప్రధాన రహదారులపై ప్రయాణించే వారి దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేసేది. అలాగే పలు కూడళ్లలో చలువ పందిళ్లు వేసేది. ఈ ఏడాది ఏప్రిల్ వచ్చినా జీవీఎంసీ చలివేంద్రాలు ఏర్పాటు చేయలేదు. అక్కడక్కడ కొన్ని ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు చలివేంద్రాలను ప్రారంభిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు మాత్రం కనీసం ఈ విషయమై దృష్టిసారించడం లేదు. గతంలో ఎండల్లో రహదారి పక్కన వడదెబ్బ తగలకుండా సేదతీరడానికి గ్రీన్‌మేట్ టెంట్లు ఏర్పాటు చేసేవారు. ఇప్పటికవరకు వాటిని కూడా ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నగర పరి ధిలో చలివేంద్రాలను, సేదతీరడానికి చలువపందిళ్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



కొమ్మాది హైవేలో జీవీఎంసీ గతంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం (ఫైల్)

విశ్వనాథ్ అడ్వంచర్ స్పోర్ట్స్‌లో భద్రత శూన్యం

... 5వ పేజీ తరువాయి

గుర్రై పక్కన రహదారిపైకి తుళ్లిపడ్డారన్నారు. ఆ ఘటనలో తన మనుమరాలు 45 రోజులు చికిత్స తీసుకుందని, వెన్నెముక సమస్య కూడా వచ్చిందన్నారు. ఇలాగే అక్కడికి వెళ్లిన చాలామంది పిల్లలకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. తాజా ఘటనకు వస్తే...పిల్లలు నీటిలో ఆడుకునే దగ్గర ఏదైనా జరిగితే కాపాడడానికి సంరక్షకులను ఉంచాలని, అటువంటి కనీస చర్యలు కూడా వారు చేపట్టకపోవడం విచారకరమన్నారు. జిల్లా కలెక్టర్‌కు దీనిపై ఫిర్యాదు చేశానన్నారు. ఏ అనుమతులతో వాటిని నిర్వహిస్తున్నారో తెలుసుకోవాలని, భద్రత చర్యలు కూడా చూడాలని, లేనిపక్షంలో దానిని మూసివేసి, పిల్లల ప్రాణాలు కాపాడాలని ఆయన కోరారు.

బాలుడిని బలిగొన్న ఈతకొలను

... 5వ పేజీ తరువాయి

బాలుడి తల్లిదండ్రులు సెటిల్‌మెంట్ చేసుకునేలా మంతనాలు జరిగాయి.

చివరికి బాధిత కుటుంబానికి రూ.లక్షల్లో నష్టపరిహారం ఇవ్వడానికి అంగీకారం కుదరడంతో బాలుడు ఆడుకుంటూ పడిపోయాడని ఫిర్యాదు ఇవ్వడం, ఆ మేరకు సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో కేసు నమోదుచేయడం జరిగింది. పెద్దమొత్తంలో సెటిల్‌మెంట్ జరిగిందని, దీనికి పోలీసులు సహకరించారనే ప్రచారం జరుగుతోంది.

అయితే సంఘటనపై ఫిర్యాదులు అందడంతో నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ డాక్టర్ అజితలు మంగళవారం విశ్వనాథ్ స్పోర్ట్స్ ఆక్వా వాటర్ వరల్డ్‌ను పరిశీలించి విచారణ చేపట్టారు.

విశ్వనాథ్ అడ్వంచర్స్ అరాచకం

... 5వ పేజీ తరువాయి

పాటించాలి. సంబంధిత సంస్థల నుంచి అనుమతులు తీసుకోవాలి. కొన్నింటికి ఎన్‌ఓసీలు కూడా అవసరం. ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే అధికారుల పరిశీలనలో ఇక్కడ స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) పాటించడం లేదని తేలింది. కేవలం ట్రేడ్ లైసెన్స్ తీసుకొని అన్నీ నడుపుతున్నట్టు భావిస్తున్నారు.

ఇవీ లోపాలు

- ప్రమాదం జరిగిన ప్రాంతంలో సీసీ టీవీ కెమెరాలు లేవు.
- ఏదైనా ప్రమాదం జరిగితే కాపాడడానికి శిక్షణ పొందిన వారు లేరు.
- ఆక్వా స్పోర్ట్స్‌లో లైఫ్ గార్డ్స్ లేవు.
- వాటర్ కెపాసిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ లేదు.
- అగ్నిప్రమాద నివారణకు ఎక్విప్‌మెంట్ లేదు.
- సర్టిఫైడ్ మెడికల్ ప్రాక్టీషనర్ లేరు.
- కొన్నింటికి ఎన్‌ఓసీలు అవసరం. అవి లేవు.

జిల్లాలో అనేకం

ఒక్క విశ్వనాథ్ ఆక్వా స్పోర్ట్స్ కాకుండా జిల్లాలో ఇంకా అనేకచోట్ల ఇలాంటివి ఉన్నాయి. పెందుర్తి పరిసరాల్లో ఇలాంటిదే నిర్వహిస్తున్నారు. ఆనందపురంలో గో కార్టింగ్ నడుపుతున్నారు. అక్కడ కూడా భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ముందు జాగ్రత్తలో వీఎంఆర్‌డీఏ

పర్యాటకుల కోసం వీఎంఆర్‌డీఏ కూడా అనేకం నిర్వహిస్తోంది. ఇటీవల కైలాసగిరిపై సర్క్యులర్ ట్రైన్ నిర్వహణ సరిగా లేదని దానిని ఆపేసింది. అలాగే రోప్‌వే వద్ద చిన్న అగ్ని ప్రమాదం జరిగిందని, నిర్వాహకుల నిర్లక్ష్యం గుర్తించి వారికి కాంట్రాక్టు రెన్యువల్ చేయలేదు. మళ్లీ టెండర్లు పిలిచారు. పర్యాటక శాఖ కూడా రుషికొండలో వాతావరణం బాగుండకపోతే బోటు షికారు నిలిపివేస్తోంది. ఇవన్నీ ప్రమాదాలు జరగకుండా చేపట్టే ముందస్తు చర్యలు. ప్రైవేటు సంస్థలు కూడా ఇలాగే నిబంధనలు పాటించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

కి'లేడీ'

... 5వ పేజీ తరువాయి

దేవీరావు అనే మహిళ ఇంటిని అద్దెకు తీసుకుంది. ఆమెకు గేదెల సన్యాసప్పడు అనే సహాయకుడు ఉండేవాడు. అతడితో కలిసి తక్కువ ధరకు స్థలాలు ఇస్తానంటూ ఆమె ప్రచారం చేసుకుంది. ఈ మేరకు భూములకు చెందిన నకిలీ డాక్యుమెంట్లు చూపించింది. ఆమె మాటలను నమ్మిన తరుణ్‌కుమార్ 2021, 2023 మధ్య కాలంలో ఆఫ్ లైన్, ఆన్‌లైన్‌లలో రూ.15 లక్షలు చెల్లించాడు.

గత ఏడాది ఏడాది జనవరి ఒకటో తేదీన ఎంవీపీ కాలనీ టీటీడీ సర్కిల్ సమీపానున్న ఆదాయపు పన్ను శాఖ కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద కొంత సొమ్ము ముట్టజెప్పాడు. అయినప్పటికీ స్థలం రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో, తన డబ్బులు వెనక్కి ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో తన సొమ్ము రూ.100 కోట్లు సీబీఐ ఆధీనంలో ఉండిపోయిందని, అది విడుదలైన తర్వాత సొమ్ముకు రెట్టింపు ఇస్తానని, మరో రూ.3 లక్షలు ఇవ్వాలని అడిగింది.

దీంతో తనను మోసం చేసిందని గ్రహించిన తరుణ్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా దేవీరావు పెందుర్తిలోని ఎం.సతీష్ అనే వ్యక్తి నుంచి, తగరపువలసలో వెంకటలక్ష్మి, మద్దిలపాలెం వాసి శ్యామ్‌కుమార్ నుంచి కూడా కొంత మొత్తాన్ని వసూలు చేసినట్టు బయటపడింది. దీంతో ఆమె బాధితులు మరింత మంది ఉండవచ్చునని భావించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖాకీ వసూల్

... 5వ పేజీ తరువాయి

తప్పవని హెచ్చరిస్తూవస్తున్నారు. అయితే పోలీస్ కమిషనరేట్‌లో కొంతమంది మధ్య స్థాయి అధికారులు రాజకీయ పలుకుబడితో పోస్టింగ్‌లు దక్కించుకున్నారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల అండదండలు తమకు పుష్కలంగా ఉన్నాయంటూ కిందిస్థాయి అధికారులు, సిబ్బంది దగ్గర గొప్పగా చెప్పుకుంటూ పరోక్షంగా వసూళ్లకు వారిని ప్రోత్సహించడం మొదలుపెట్టారు. ముందుగా ట్రాఫిక్ విభాగంలో కొందరు అధికారులు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు, వ్యాపారులతో, తర్వాత క్రైమ్ విభాగంలోని కొందరు అధికారులు స్క్రాప్ వ్యాపారులతో అవగాహన కుదుర్చుకున్నట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది. తాజాగా శాంతి భద్రతల విభాగం పోలీసులు కూడా వసూళ్లపై దృష్టిసారించారని,అందులో భాగంగానే మద్యం దుకాణాలు, బార్‌ల నుంచి నెలవారీ మామూళ్లు పెట్టుకున్నారని ఆరోపిస్తున్నారు. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 142 మద్యం దుకాణాలు, 117 బార్‌లు ఉన్నాయి. గతంలో ప్రైవేటు మద్యం దుకాణాలు ఉన్నప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు నెలవారీ మామూళ్లు అందేవి. జనరల్ కానిస్టేబుల్ వాటిని వసూలుచేసి స్టేషన్ అధికారికి అందజేసేవారు. వైసీపీ హయాంలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించడంతో మామూళ్లు నిలిచిపోయాయి. కేవలం బార్‌ల నుంచి మాత్రమే నెలవారీ మామూళ్లు కొనసాగేవి. సీపీగా శంఖబ్రతబాగ్చి బాధ్యతలు చేపట్టిన తర్వాత బార్‌ల నుంచి కూడా మామూళ్లను పోలీసులు నిలిపివేశారు. అయితే నగర పోలీస్ కమిషనరేట్‌లో ఇటీవల పోస్టింగ్‌లు పొందిన కొంతమంది మధ్యస్థాయి అధికారులు...మద్యం వ్యాపారుల నుంచి నెలవారీ మామూళ్లు తిరిగి ప్రారంభించాలని తమ కిందిస్థాయిలోని ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు. ఎక్కడైనా బయటకు వచ్చినా దానిని సీపీ దృష్టికి చేరకుండా తమ స్థాయిలోనే ఏదో ఒకటి చెప్పి సర్దుబాటు చేస్తామని భరోసా ఇచ్చినట్టు సమాచారం. దీంతో గతనెల నుంచి దాదాపు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ మద్యం దుకాణాలు, బార్‌ల నుంచి నెలవారీ వసూళ్ల ప్రక్రియ ప్రారంభించేశారు.

మద్యం దుకాణానికి రూ.5 వేల నుంచి రూ.8 వేలు

ప్రతి మద్యం దుకాణం వద్దకు సంబంధిత సీఐలు కొన్నాళ్ల కిందట పెట్రోలింగ్ పేరుతో ప్రత్యక్షంగా వెళ్లారు. దుకాణాల వద్ద పాటించాల్సిన జాగ్రత్తలు, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎదురయ్యే ఇబ్బందులను వారికి వివరించారు. తర్వాత సిండికేట్‌ల ద్వారా వ్యాపారులు సంప్రతింపులు చేసి నెలవారీ మామూళ్లపై అవగాహనకు వచ్చినట్టు చెబుతున్నారు. దుకాణంలో విక్రయాల స్థాయిని బట్టి నెలకు రూ.ఐదు వేల నుంచి రూ.ఎనిమిది వేల వరకు నెలవారీ మామూళ్లు నిర్ణయించారు. అలాగే బార్‌ల వద్ద రౌడీషీటర్లు, ఆకతాయిలు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని వ్యాపారులను బెదిరించి వారి నుంచి నెలకు రూ.7,500 నుంచి రూ.పది వేల వరకు మామూళ్లు తీసుకుంటున్నారు. కొన్ని దుకాణాల్లో వ్యాపారం ఆశాజనకంగా లేనప్పటికీ పోలీసులతో తలనొప్పి ఎందుకనే భావనతో అడిగినంత ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఇదికాకుండా నగరంలో ఎక్కడైనా దాడులు నిర్వహించే అధికారం కలిగిన ప్రత్యేక విభాగం మద్యం దుకాణం నుంచి రూ.రెండు వేలు, బార్ నుంచి రూ.ఐదు వేలు చొప్పున వసూలు చేస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. దీనిపై పోలీస్ శాఖలోని మధ్యస్థాయి అధికారులకు పూర్తిసమాచారం ఉన్నప్పటికీ తమకు వాటాలు వస్తుండడంతో ఈ విషయాన్ని సీపీ దృష్టికి చేరకుండా చూస్తున్నారంటున్నారు.

30లోగా ఆస్తి పన్ను చెల్లిస్తే.. 5 శాతం రాయితీ

» జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : 2025-26 ఆర్థిక వార్షికానికి సంబంధించి ఆస్తి పన్ను, ఖాళీ జాగా పన్నులను ఈ నెల 30లోగా చెల్లించి 5 శాతం రాయితీ పొందవచ్చని విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్‌ల చట్టం 1955, సెక్షన్ 265(3) అనుసరించి, ఆస్తి పన్ను డిమాండ్ నోటీసు సర్వీస్‌తో సంబంధం లేకుండా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ జాగా పన్నులను ఏప్రిల్ నెల 30లోగా చెల్లించి 5 శాతం రాయితీని ఆస్తిపన్ను దారులు పొందవచ్చన్నారు. (ఎర్లీ బర్డ్ ఆఫర్). నగర ప్రజలందరూ ఈ సదవకాశమును ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఆస్తి పన్నుల చెల్లింపులకు సంబంధించి ప్రజల సౌకర్యార్థం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల సౌకర్యం కేంద్రం, అన్ని జోనల్ కార్యాలయాల్లో సౌకర్యం కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు పని చేస్తాయని, ఆదివారం సెలవు దినాల్లో కూడా సౌకర్యం కేంద్రాలు పని చేస్తాయన్నారు.

నేడు బీసీ లోన్‌మేళా

ఆరిలోవ ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణం నిమిత్తం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 9న (బుధవారం) ఉదయం 10 గంటలకు ఆరిలోవలోని 13వ వార్డులోగల ఆఖరి బస్ స్టాపు వద్ద ఉన్న జీవీఎంసీ కమ్యూనిటీ హాలులో నిర్వహించే లోన్ మేళాకు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలని జీవీఎంసీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీసీ కార్పొరేషన్‌అధికారులతో పాటు జీవీఎంసీ అధికారుల బృందం వస్తున్నట్లు చెప్పారు.

ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నరేష్



విశాఖ లీగల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడిగా యడ్ల నరేష్‌ను నియమించారు. మంగళవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ నియామకం చేపడుతూ, తక్షణమే అమల్లోకి వస్తుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.శాంతకుమారి తెలియజేశారు. నియామక పత్రాన్ని నరేష్‌కు అందజేశారు. అన్ని వర్గాలను కలుపుకుంటూ అసోసియేషన్‌ను సమర్థంగా నడుపుతానని, ముఖ్యంగా మహిళలకు తగిన ప్రాధాన్యత ఇస్తానని తెలియజేశారు. తనను నియమించిన రాష్ట్ర కార్యవర్గానికి, సీనియర్ న్యాయవాదులు పాకా సత్యనారాయణ, కే.సురేష్‌కుమార్, వడ్డే రవిబాబు, ఉత్తరాంధ్ర కన్వీనర్ ఎం.అప్పారావు, ఎడిషినల్ జీపీ బలగ సత్యం, వై.వసంతకుమారి, ఎం.రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

సినిమా గైడ్

● **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),

● **పెళ్ళికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)

● **కోర్ట్** : జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఛావా** : శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు(నలుపు) 28, బెండకాయలు 28, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 34, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 15, క్యారెట్ 36 దొండకాయలు 24, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 24, అల్లం (పాతది)48, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మ కాయలు (కిలో) 120, బద్దచిక్కుడు 62, దోస కాయలు 24, వె ల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 24, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28 చిలగడదుంపలు 40, కంద 60, దేముడుచిక్కుడు 60, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు(కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 18, మామిడి అల్లం 55, బొప్పాయి 42, జామ (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

నత్తనడకన దివ్యాంగులకు వైద్య పరీక్షలు

- » జనవరి 21 నుంచి ప్రారంభం
- » 75 రోజులు దాటినా పూర్తి కాని వైనం
- » తాజాగా ఈ నెల 4 నుంచి సదరం స్లాట్‌లు
- » జోన్-3లో దివ్యాంగులు 2166
- » పూర్తి కాని అనర్హుల ఏరివేత



మద్దిలపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛను పథకంలో అనర్హుల ఏరివేతకు నిర్వహిస్తున్న దివ్యాంగులకు వైద్య పరీక్షలు నత్తనడక సాగుతోంది. జనవరి 21న ప్రారంభించిన ఈ పరిశీలన 75 రోజులవుతున్నా ఇంకా పూర్తి కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం తొలుత ఫిబ్రవరి నెలాఖరులోపు దివ్యాంగుల పింఛన్ దారుల్లో అర్హులను గుర్తించాలని ఆదేశాలిచ్చింది. అయితే ఈ గడువులో కేవలం ఇంటి నుంచి కదల్లేని వారిని మాత్రమే పరీక్షలు నిర్వహించగలిగారు. మిగతా కేటగిరిల్లో దివ్యాంగులకు పరీక్షలు జరగలేదు. దీంతో మార్చి నెలాఖరు వరకు సమయం ఇచ్చారు. అదీ కూడా పూర్తయినా అనర్హుల లెక్క తేలలేదు. దీంతో గత శుక్రవారం నుంచి సదరం క్యాంపులకు స్లాట్ బుకింగ్‌లు ప్రారంభిస్తున్నారు. వార్డు సచివాలయాలు, మీ సేవల్లో స్లాటులు తీసుకోవాలి. సమీపంలోని ఆస్పత్రిలో సమయంతో కూడిన తేదీని నిర్ణయిస్తారు. ఆ తేదీన దివ్యాంగులు ఎంపిక చేసిన ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. ఈ ప్రక్రియ జూన్ వరకు కొనసాగనుంది.

జోన్-3లో జోన్-3లో 2166 దివ్యాంగులు

జోన్-3 పరిధిలో 2166 మంది దివ్యాంగ పింఛనుదారులున్నారు. వీరిలో 32 మంది రూ.15 వేలు.., 15 మంది రూ.12 వేలు.., 155 మంది రూ.10వేలు, 49 మంది రూ.8 వేలు.., 1954 మంది రూ.6 వేలు చొప్పున ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందుకుంటున్నారు. వీరికి గత శుక్రవారం నుంచి సదరం రీసెస్‌మెంట్ కార్యక్రమం నిర్వహించడం మొదలు పెట్టారు. ఇంటి వద్ద వీల్‌చైర్, మంచానికే పరిమితమై 32 మందికి వైద్య పరీక్షలు పూర్తి చేశారు. దృష్టిలోపం, మానసిక వికలాంగులు, వినికిడి లోపం, మూగ.. ఇలా కొన్ని విభాగాల్లో లబ్ధిదారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇంకా శారీరక వికలాంగులు తదితర విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. వీరంతా శుక్రవారం నుంచి దివ్యాంగ పరిశీలన చేయించుకోవాలి. సమీపంలోని సచివాలయం, మీ సేవలో శ్లాటు బుక్ చేసుకుని ఆస్పత్రికి వెళ్తే వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. గత ప్రభుత్వంలో చాలా మంది తప్పుడు ధ్రువపత్రాలతో దివ్యాంగ పింఛన్లు అందుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాంటి వారిని ఏరివేయాలని ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం త్వరతగతిన జరగక పోవడం గమనార్హం.

జీవ వైవిధ్యంపై అవగాహన అవసరం

ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్‌కుమార్ నాయక్



ఎ వైల్డ్ డాగ్ బ్రీడింగ్ సెంటర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయకుమార్ నాయక్

ఆరిలోవ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జంతు ప్రేమికులంతా జీవ వైవిధ్యంపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్‌కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. నగరంలోనిఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో మంగళవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటనలో పాల్గొనేందుకు అటవీశాఖ అదనపు కన్జర్వేటర్ శాంతిప్రియ పాండే, అడిషనల్ చీఫ్ కన్జర్వేటర్ రాహుల్ పాండే, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ దివాన్ మైదిన్ తదితరులు హాజరయ్యారు. అనివార్య కారణాలతో ఉప ముఖ్యమంత్రి పర్యటన రద్దు కావడంతో జూలో ఇటీవల నిర్మించిన మోటులను సందర్శించారు. కంబాలకొండ రిజర్వుఫారెస్టులో చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ మంగమ్మ, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. జూలో వివిధ నిర్మాణాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేసేందుకు ఉప ముఖ్యమంత్రితో రావాల్సి ఉందని, కార్యక్రమం రద్దు కావడంతో మళ్లీ ఎప్పుడు చేపట్టాలనే దానిపై చర్చించారు. అనంతరం ఏపీ జూ లవర్స్‌డే, వైల్డ్ డాగ్ బ్రీడింగ్ సెంటర్ పోస్టర్‌లను నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ జంతు ప్రేమికుల దినోత్సవాన్ని ఏటా ఏప్రిల్ 8వ తేదీన నిర్వహిస్తున్నామన్నారు. జంతువుల ఆవాసాలను పెంచేందుకు, వాటిని అభివృద్ధి చేసేందుకు అడవులు దోహదపడతాయన్నారు. మొక్కలను నాటి వాటిని పెంచాల్సిన బాధ్యత మానవాళిపై ఉందన్నారు. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు, అనేక రకాల జంతువుల మనుగడకు అడవులు కీలకమన్నారు. అంతరించి పోతున్న జంతు జాతులను పరిరక్షించి, వాటిని అభివృద్ధి చేయడంలో జంతు ప్రదర్శనశాలలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు.

పవన్ పర్యటన రద్దులో నిరుత్సాహం

ఆరిలోవ, (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖామంత్రి పవన్‌కల్యాణ్ సందర్శిరని సంబర పడిన వారంతా ఆయన పర్యటన రద్దు కావడంతో నిరాశకు గురయ్యారు. డిప్యూటీ సీఎం వస్తారన్న సమాచారంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయన పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేశారు. ఆసక్తిగా ఎదురు చూశారు. అంతలోనే పవనకల్యాణ్ పర్యటన రద్దయిందని తెలియడంతో నిరుత్సాహానికి గురయ్యారు. ఆయన సందర్శనకు వస్తారన్న ఆసక్తితో జూ వద్దకు పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. వారు కూడా నిరుత్సాహానికి గురయ్యారు.

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

సిరిపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం హనుమాన్ విజయోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహిస్తున్న హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో బైక్ ర్యాలీ, హనుమాన్ శోభాయాత్ర గోడపత్రికను ఆవిష్కరించారు.శనివారం మధ్యాహ్నం నుంచి జరిగే బైక్‌ర్యాలీలో పెద్ద ఎత్తున హనుమాన్ భక్తులు పాల్గొనాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరుశురామ్‌రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'సే నో టు డ్రగ్స్' అవగాహన ర్యాలీ



ర్యాలీని నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : ఏయూ ఐఏఎస్ఈ బీఈడీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' పేరిట అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఐఏఎస్ఈ నుంచి ఏయూ రిజిస్టర్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నాగరాజకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వై.శ్రీదేవి, అధ్యాపక బృందం, బీఈడీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌లు, విద్యార్థులు ఎంతో చురుకుగా ఉత్సాహంగా యాంటీ డ్రగ్ ర్యాలీలో పాల్గొన్నారు.

ట్రిపుల్ రైడింగ్‌పై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడంతో పాటు నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో పైలా ప్రవీణ్‌కుమార్‌పై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలోని మద్దిలపాలెం కూడలిలో సోమవారం సాయంత్రం ట్రాఫిక్ ఎస్ఐ కనకారావు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో గాజువాక భానోజీతోటకు చెందిన పైలా ప్రవీణ్‌కుమార్ (23) తన వాహనంపై మరో ఇద్దరిని ఎక్కించుకుని, నిర్లక్ష్యంగా వాహనం నడుపుతున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే గంటా కార్యాలయం వద్ద సీఐటీయూ నేతల నిరసన

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించడానికి సీఐటీయు నాయకులు, కార్మికులు ఎంవీపీ కాలనీలోని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసానికి మంగళవారం సాయంత్రం వెళ్లారు. వినతి పత్రం ఇవ్వమని వ్యక్తిగత కార్యదర్శులు వచ్చినా తాము ఎమ్మెల్యేకు మాత్రమే ఇస్తామని కార్మికులు భీష్మించడంతో పరిస్థితి కాస్త గందరగోళంగా మారింది. తాము ఎమ్మెల్యేను స్వయంగా తమ బాధలు చెప్పుకుంటామని కార్మికులు కాసేపు నిరసన వ్యక్తం చేశారు. సీఐ మురళీ తన సిబ్బందితో వచ్చి, నాయకులకు నచ్చచెప్పి పంపించేశారు. ఎమ్మెల్యే ఇంట్లోనే ఉన్నా, బయటకు రాకుండా కార్మికులను అవమాన పరిచారని సీఐటీయు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక నాయకులు వి.కృష్ణారావు, శ్రీను, కుమారి, ఆదినారాయణ, శేషబాబు, కొండమ్మ, శ్రీదేవి, విజయ, చెల్లయ్యమ్మ, రాజు, గోపి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు విభాగంలో ఆటా-పాట

ద్వితీయ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 08 (ఆంధ్రజ్యోతి) : ఏయూ తెలుగు విభాగం విద్యార్థులు మంగళవారం ఆటపాటలతో దుమ్మురేపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సందడిగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యర్థులు అనేక సినీ, జానపద గేయాలకు లయబద్ధంగా స్టెప్‌లు వేశారు. వీరి సందడితో విభాగం మొత్తం మారు మోగింది. తొలుత తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన వీడ్కోలు సభ ప్రారంభం కాగా ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యతోనే అపారమైన ఉన్నత ఉపాధి అవకాశాలు లభిస్తాయని కావున ప్రతి ఒక్క విద్యార్థి తమ తల్లిదండ్రుల కలలు నెరవేర్చే విధంగా ముందుకు సాగాలన్నారు. ఒకవైపు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునే మరో వైపు ఉన్నత విద్యాభ్యాసం కూడా కొనసాగించవచ్చున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఎమ్మెల్యే రామకృష్ణబాబుకు సీఐటీయూ నేతల వినతి



ఎమ్మెల్యే వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని కోరుతూ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు సీఐటీయు నాయకులు మంగళవారం వినతిపత్రం అందించారు. ఎంవీపీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సీఐటీయు నాయకులు ఎమ్మెల్యేన కలిసి విన్నవించారు. గత వైసీపీ ప్రభుత్వం పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి, ఆప్కాస్ చేర్పిందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి, పాత విధానాన్ని తెస్తానని చెప్పడంతో కార్మికుల్లో ఆందోళన మొదలైందని తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతి అంటే దోపిడీ, వేధింపులు, తొలగింపులు పెరుగుతాయని, చేతికి పూర్తి జీతం రాదని, ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు ఖాతాలకు జమ కాకుండా అభద్రత ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్కాస్‌ను కొనసాగిస్తూనే కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. అలాగే అనారోగ్యం, చనిపోయిన వారి స్థానాల్లో వారసులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కార్మికుల డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సీఐటీయు నాయకులు వి.కృష్ణారావు, సహాయ కార్యదర్శి జేఆర్ నాయుడుపాల్గొన్నారు.

ఉత్సాహంగా వాల్తేరు రైల్వే స్పోర్ట్సు మేళా ప్రారంభం



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ వాల్తేరు డివిజన్ నిర్వహిస్తున్న డివిజనల్ అంతర్గత క్రీడలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వాల్తేరు క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా ముఖ్య అతిథిగా హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్తేరు డివిజన్‌లో ప్రతిభ గల క్రీడాకారులు వృత్తిపరంగానే కాకుండా క్రీడారంగంలో రాణిస్తూ డివిజన్ ఖ్యాతిని పెంచుతున్నారని ప్రశంసించారు. ఏటా నిర్వహిస్తున్న స్పోర్ట్సు మేళా ఉద్యోగులలో స్ఫూర్తిని, అంకితభావాన్ని పెంచుతుందని అభిప్రాయపడ్డారు. అంతర్గత క్రీడా పోటీలు నిర్వహిస్తున్న అతి కొద్ది డివిజన్లలో వాల్తేరు రైల్వే ఒకటి కావడం విశేషమన్నారు. ఈ మేళాలో మహిళా ఉద్యోగులు కూడా ప్రాతినిధ్యం వహించడం ఆనందదాయకమన్నారు. నెలాఖరు వరకు జరిగే మేళాలో వాల్తేరు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల ఉద్యోగులు 16 క్రీడాంశాలలో పాల్గొంటాయన్నారు. మేళా ప్రారంభ సూచికగా డీఆర్ఎం లలిత్ బొహ్రా కొద్దిసేపు క్రికెట్ ఆడి (బ్యాటింగ్) ఉద్యోగులను ఉత్సాహపరిచారు. అనంతరం కమర్షియల్, ఆర్పీఎఫ్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్‌ను డీఆర్ఎం ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇ.శాంతారామ్, స్పోర్ట్సు ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్ అవినాష్, ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు. తొలిరోజు జరిగిన క్రికెట్ టోర్నీలో భాగంగా తొలి మ్యాచ్‌లో ఆర్పీఎఫ్ 50 పరుగుల తేడాతో కమర్షియల్‌పై, ఎలక్ట్రికల్ (ఆపరేషన్స్) ఆరు వికెట్ల తేడాతో ఎలక్ట్రికల్ (ఈఎల్ఎస్)పై గెలుపొందాయి.



సరదాగా బ్యాటింగ్ చేస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

16న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జడ్పీ కార్యనిర్వాహక అధికారి పి.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు హాజరుకావాలని కోరారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి : ఎంపీ శ్రీభరత్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీశ్రీభరత్

రామ్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించటంలో నిర్మాణ్ ఎన్జీవో హెచ్‌ఆర్ కాన్‌క్లేవ్ చేస్తున్న కృషి అభినందనీయమని విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్ అన్నారు. ఇంపాక్ట్ హైరింగ్ కాన్సెప్ట్‌పై మంగళవారం హోటల్ ఫోర్ పాయింట్స్‌లో గ్లోబల్ నాన్ నిర్మాణ్ ఎన్జీవో హెచ్‌ఆర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ శ్రీభరత్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న సమయంలో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే విధానాలకు కృషి చేయాలని తెలిపారు. అందివచ్చే ఉద్యోగావకాశాలను సైతం యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ముఖ్యంగా సామాజికంగా వెనుకబడిన వర్గాల వారికి నైపుణ్యం ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఉద్యోగం అందరి హక్కు అనే విధంగా అవకాశాలు కల్పించడం, యువత కోసం సంస్థ చేపడుతున్న కృషిని అభినందించారు. ఆర్థిక వ్యవస్థలో సమాన భాగస్వామ్యం కల్పించడం నైపుణ్యం ఆదారంగా ఉద్యోగ అవకాశాలను కల్పించడం మంచి ఉద్దేశం అని అన్నారు, కార్యక్రమంలో సంస్థ సీఈవో మయూర్ పట్నాలా, లక్ష్మి ముక్కవల్లి, సురేష్ నర్రా, ప్రత్యూష శర్మ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలి

» జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సీఎంహెచ్‌వో నరేశ్‌కుమార్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా నగర ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్టేగ్ హోల్డర్స్‌తో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంహెచ్‌వో నరేష్‌కుమార్ మాట్లాడుతూ వేసవి కాలంలో వడదెబ్బకు గురి కాకుండా నగర ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, జీవీఎంసీ నగరంలో పలుచోట్ల ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా నగరంలో చలివేంద్రాలు ఏర్పాటుకు ముందుకు వస్తున్నారని, వారికి జీవీఎంసీ సహకారం అందిస్తుందని, వారు కోరితే తాగునీరు అందిస్తామని వెల్లడించారు. వేసవిలో ముఖ్యంగా.. మధ్యాహ్నం వృద్ధులు, పిల్లలు తప్పనిపరిస్థితులో తప్ప బయట తిరగరాదని, వదులుగా ఉన్న తెలుపు రంగు కాటన్ దుస్తులు ధరిస్తే మంచిదని సూచించారు. జీవీఎంసీ వేసవిలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, అలాగే స్టేగ్ హోల్డర్స్ కూడా సాధ్యమైనంత వరకు అవగాహన కార్యక్రమంలో పాల్గొని వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ప్రజలకు కల్పించాలని సూచించారు. అనంతరం స్టేగ్ హోల్డర్స్ ప్రతినిధులు వారు చేపట్టే కార్యక్రమాలతో పాటు పలు సూచనలను చేశారు. సమావేశంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీరు రాజేంద్ర కృష్ణ, జోనల్ కమిషనర్లు మల్లయ్యనాయుడు, శివప్రసాద్, ఏఎంఓహెచ్‌లు కిషోర్, సునీల్, అప్పలనాయుడు, బి.ప్రసాదరావు, కిరణ్, ఎస్ఆర్‌యూ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రతన్‌మోహిని మృతి తీరని లోటు

బ్రహ్మకుమారీస్ హెచ్‌బీ కాలనీ శాఖ బ్రహ్మకుమారి రామేశ్వరి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : బ్రహ్మకుమారీస్ అధినేత్రి దాది రతన్‌మోహిని (100) మంగళవారం తమ పార్థివ శరీరాన్ని త్యాగం చేశారని, ఆమె మరణం యావత్ బ్రహ్మకుమారీస్‌కు తీరని లోటు అని బ్రహ్మకుమారీస్ హెచ్‌బీ కాలనీ శాఖ బ్రహ్మకుమారి రామేశ్వరి ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

1925, మార్చి 25న జన్మించిన దాదీజీ అతి పిన్న వయసులో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో సమర్పితమై ప్రపంచమంతా పర్యటించి ఆధ్యాత్మిక ప్రగతికి పాటు పడ్డారన్నారు. ఎన్నో దేశాలు పర్యటించిన దాదీ జాతి, మత భేదాలకు అతీతంగా వ్యక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం కలిగించి ఎందరికో మార్గదర్శకులయ్యారని గుర్తు చేసుకున్నారు. సంస్థ యొక్క యువ విభాగానికి చీఫ్‌గా ఉంటూ దేశవిదేశాల్లో యువతకు విలువలతో కూడిన సమాజ స్థాపనకై విశిష్ట సేవలు అందించారన్నారు.

'బాల్యంలో సులభమైన విద్యతో సత్ఫలితాలు'



స్కూల్ ఆఫ్ వండర్‌కిడ్స్ సందర్శించిన తెలంగాణలోని పలు పాఠశాలల కరస్పాండెట్లు

మద్దిలపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రారంభ దశలో పాఠశాలలకు వచ్చే బాలలకు సులువైన విద్య అందించడం ద్వారానే సత్ఫలితాలు సాధిస్తామని స్కూల్ ఆఫ్ వండర్‌కిడ్స్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు పేర్కొన్నారు. మద్దిలపాలెంలోని స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ పాఠశాలను మంగళవారం తెలంగాణ రాష్ట్రంలోని 27 పాఠశాలల కరస్పాండెట్లు సందర్శించారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ బాల్యంలో పిల్లలకు కష్టం లేని చదువు నేర్పించడంపై దృష్టిపెట్టామన్నారు. ప్రీ కేజీ నుంచి యూకేజీ వరకు తమ స్కూల్లో పిల్లలకు పుస్తకాలు లేని విద్య అంది స్తున్నామన్నారు. హోంవర్క్, నోట్స్ లేని వినూత్న విధానంతో ముందుకు వెళ్తున్నామన్నారు. అనంతరం తెలంగాణ స్కూల్స్ ప్రతినిధులు విద్యార్థుల కనబరిచిన ప్రతిభకు అబ్బురపడ్డారు. తమ పాఠశాలల్లో కూడా ఈ తరహా బోధన పద్ధతులు అవలంబిస్తామన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ వండర్‌కిడ్స్ ప్రిన్సిపాల్ మళ్ల శర్వాణి, మళ్ల వాణిశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్ఐను దుర్భాషలాడిన వ్యక్తి అరెస్టు

గాజువాక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకున్న సివిల్ సప్లైఆర్ఐతో దుర్భాషలాడిన వ్యాపారిని గాజువాక పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. గాజువాకకు చెందిన పి.కృష్ణమూర్తి అనే వ్యక్తి ఈ నెల 2న రేషన్ బియ్యాన్ని వ్యాన్‌లోఅక్రమంగా తరలిస్తున్నాడనే సమాచారంతో సివిల్ సప్లై ఆర్ఐ పద్మావతి గాజువాకలో పట్టుకున్నారు. ఆ సమయంలో ఆమెతో అసభ్యకరంగా మాట్లాడడంతో పాటు దుర్భాషలాడాడు. ఆర్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కృష్ణమూర్తిని అరెస్టు చేశారు. కాగా కృష్ణమూర్తిపై అక్రమ బియ్యం తరలింపుపై గతంలో తొమ్మిది కేసులున్నట్టు పోలీసులు తెలిపారు.

హైవే గ్రీనరీకి ఊపిరి


మొక్కల్ని తీరుగా కటింగ్ చేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది

మురళీనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంతకంతకూ పెరుగుతున్న ఎండల తీవ్రత నుంచి సకాలంలో నీటిని అందిస్తూ జీవీఎంసీ అధికారులు మొక్కలకూ ప్రాణం పోస్తున్నారు. నగరానికి మణిహారంలా ఉన్న పచ్చని హైవే గ్రీనరీ మొక్కలకు రక్షణ చర్యలు చేపడుతున్నారు. వీటిని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఎన్ఏడీ కొత్తరోడ్డు నుంచి తాటిచెట్లపాలెం వరకు ఉన్న దారిలో రంగు రంగుల పూల మొక్కలు, వివిధ జాతుల ఇంపోర్టెడ్ రకాల మొక్కల్ని ఎండల నుంచి కాపాడుతున్నారు. నగరవాసులు, ప్రయాణికులకు ఆహ్లాదం పంచుతూ, విశాఖలోకి గేట్‌వే లా ఉండే ఎన్ఏడీ కొత్త రోడ్డు దాటాక నగరదారుల్లోకి ప్రవేశించే వారికి కొత్త అనుభూతిని పంచుతున్నారు. నాలుగు వరసల హైవేలో సెంటర్‌లోని ప్రదాన డివైడరు సహా నాలుగో లైన్ సర్వీసు రోడ్డు వరకు మొక్కలకు ఈ ఎండల్లో తగినంత నీటిని అందిస్తూ, ఆకర్షణీయంగా గార్డెనింగ్ చేస్తున్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు..!


ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డులో ఆక్రమిత షెడ్లు

కంచరపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54వవార్డు పరిధి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు వెళ్లే మార్గంలో పట్టణ ఆరోగ్య కేంద్రానికి ఎదురుగా ఉన్న స్థలాన్ని ఆక్రమించుకుని కొంత మంది నిర్మాణాలు చేస్తున్నారు. ఈ మార్గంలోని ప్రభుత్వ స్థలంలో గెడ్డపై చదును చేసి నాలుగు రేకుల షెడ్లు నిర్మించి అద్దెకు ఇచ్చి సొమ్ముచేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నగరం నడిబొడ్డున మెయిన్ రోడ్డులో ఇలా ప్రభుత్వ స్థలాలను దర్జాగా ఆక్రమిస్తున్నా సంబంధిత రెవెన్యూ, జీవీఎంసీ అధికారులకు పట్టకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు మీద చిన్న తోపుడు బండి పెట్టుకుని జీవనం సాగించే పేదోడిపై తీవ్రస్థాయిలో తమ ప్రతాపం చూపించే అధికారులు ఇలా విలువైన స్థలాలను పేదల పేరుతో ఆక్రమిస్తుంటే మిన్నకుండిపోవడంపై స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు దృష్టి సారించి విలువైన స్థలాలను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

16న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జడ్పీ కార్యనిర్వాహక అధికారి పి.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు హాజరుకావాలని కోరారు.

విశ్వనాథ్ అడ్వంచర్స్ అరాచకం

... 5వ పేజీ తరువాయి

పాటించాలి. సంబంధిత సంస్థల నుంచి అనుమతులు తీసుకోవాలి. కొన్నింటికి ఎన్ఓసీలు కూడా అవసరం. ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే అధికారుల పరిశీలనలో ఇక్కడ స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) పాటించడం లేదని తేలింది. కేవలం ట్రేడ్ లైసెన్స్ తీసుకొని అన్నీ నడుపుతున్నట్టు భావిస్తున్నారు.

ఇవీ లోపాలు

- ప్రమాదం జరిగిన ప్రాంతంలో సీసీ టీవీ కెమెరాలు లేవు.
- ఏదైనా ప్రమాదం జరిగితే కాపాడడానికి శిక్షణ పొందిన వారు లేరు.
- ఆక్వా స్పోర్ట్స్‌లో లైఫ్ గార్డ్స్ లేవు.
- వాటర్ కెపాసిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ లేదు.
- అగ్నిప్రమాద నివారణకు ఎక్విప్‌మెంట్ లేదు.
- సర్టిఫైడ్ మెడికల్ ప్రాక్టీషనర్ లేరు.
- కొన్నింటికి ఎన్ఓసీలు అవసరం. అవి లేవు.

జిల్లాలో అనేకం

ఒక్క విశ్వనాథ్ ఆక్వా స్పోర్ట్స్ కాకుండా జిల్లాలో ఇంకా అనేకచోట్ల ఇలాంటివి ఉన్నాయి. పెందుర్తి పరిసరాల్లో ఇలాంటిదే నిర్వహిస్తున్నారు. ఆనందపురంలో గో కార్టింగ్ నడుపుతున్నారు. అక్కడ కూడా భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ముందు జాగ్రత్తలో వీఎంఆర్‌డీఏ

పర్యాటకుల కోసం వీఎంఆర్‌డీఏ కూడా అనేకం నిర్వహిస్తోంది. ఇటీవల కైలాసగిరిపై సర్క్యులర్ ట్రైన్ నిర్వహణ సరిగా లేదని దానిని ఆపేసింది. అలాగే రోప్‌వే వద్ద చిన్న అగ్ని ప్రమాదం జరిగిందని, నిర్వాహకుల నిర్లక్ష్యం గుర్తించి వారికి కాంట్రాక్టు రెన్యువల్ చేయలేదు. మళ్లీ టెండర్లు పిలిచారు. పర్యాటక శాఖ కూడా రుషికొండలో వాతావరణం బాగుండకపోతే బోటు షికారు నిలిపివేస్తోంది. ఇవన్నీ ప్రమాదాలు జరగకుండా చేపట్టే ముందస్తు చర్యలు. ప్రైవేటు సంస్థలు కూడా ఇలాగే నిబంధనలు పాటించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

బాలుడిని బలిగొన్న ఈతకొలను

... 5వ పేజీ తరువాయి

బాలుడి తల్లిదండ్రులు సెటిల్‌మెంట్ చేసుకునేలా మంతనాలు జరిగాయి. చివరికి బాధిత కుటుంబానికి రూ.లక్షల్లో నష్టపరిహారం ఇవ్వడానికి అంగీకారం కుదరడంతో బాలుడు ఆడుకుంటూ పడిపోయాడని ఫిర్యాదు ఇవ్వడం, ఆ మేరకు సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో కేసు నమోదుచేయడం జరిగింది. పెద్దమొత్తంలో సెటిల్‌మెంట్ జరిగిందని, దీనికి పోలీసులు సహకరించారనే ప్రచారం జరుగుతోంది. అయితే సంఘటనపై ఫిర్యాదులు అందడంతో నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ డాక్టర్ అజితలు మంగళవారం విశ్వనాథ్ స్పోర్ట్స్ ఆక్వా వాటర్ వరల్డ్‌ను పరిశీలించి విచారణ చేపట్టారు.

పవన్ కుమారుడు కోలుకోవాలని ప్రత్యేక పూజలు


తాటిచెట్లపాలెం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలకు విచ్చేసిన జనసేన నాయకులు


దొండపర్తిలోని ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న జనసేన నాయకులు

అక్కయ్యపాలెం/జ్ఞానాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ మంగళవారం రాత్రి గ్రేటర్ 55వ వార్డు జనసేన సీనియర్ నాయకుడు గొంప సాయికృష్ణ ఆధ్వర్యంలో తాటిచెట్లపాలెంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, నాయకులు నీరుకొండ దివాకర్, నాగమణి, నూకరాజు, గొంప సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఉదయం దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకులు మార్క్ శంకర్ తొందరగా కోలుకోవాలని కోరుకుంటూ దొండపర్తిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య డైరెక్టర్ కొల్లూరు రూప, జనసేన నాయకులు గుండు సురేష్‌బాబు, నారా నాగేశ్వరరావు, పెదరాజు, రాజేష్, నాయుడు, పద్మ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విశాఖలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపునకు వినూత్న కార్యక్రమాలు చేడతామని గాయత్రీ విద్యా సంస్థల డైరెక్టర్ దిట్టకవి గిరిధర్ తెలిపారు. మంగళవారం విద్యా కౌన్సిల్ మాజీ సభ్యుడు జీపీ నారాయణరావు, సామాజికవేత్తలు ప్రొఫెసర్ కొండపర్తి మురళీకృష్ణ, గోన సీతారామస్వామి కలిసి యువత జీవితాన్ని నాశనం చేస్తున్న డ్రగ్స్, హెల్మెట్ ధారణ, ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలపై మాట్లాడారు. పెద్దఎత్తున మొక్కల పెంపకానికి నిర్ణయం తీసుకున్నామని గిరిధర్ తెలిపారు. నారాయణరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, మద్యానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మాణిక్యరావుకు టీడీపీ సత్కారం



అక్కయ్యపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరానికి విచ్చేసిన అండమాన్ నికోబార్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నక్కా మాణిక్యరావును స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిలైన్ లాజిస్టిక్ వెంకటరావు, నానాజీ, వెంకటరావు పాల్గొన్నారు.

ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడుగా యడ్ల నరేష్

విశాఖ లీగల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడిగా యడ్ల నరేష్‌ను నియమించారు. మంగళవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ నియామకం చేపడుతూ, తక్షణమే అమల్లోకి వస్తుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.శాంతకుమారి తెలియజేశారు.



నియామక పత్రాన్ని నరేష్‌కు అందజేశారు. అన్ని వర్గాలను కలుపుకుంటూ అసోసియేషన్‌ను సమర్థంగా నడుపుతానని, ముఖ్యంగా మహిళలకు తగిన ప్రాధాన్యత ఇస్తానని తెలియజేశారు. తనను నియమించిన రాష్ట్ర కార్యవర్గానికి, సీనియర్ న్యాయవాదులు పాకా సత్యనారాయణ, కే.సురేష్‌కుమార్, వడ్డే రవిబాబు, ఉత్తరాంధ్ర కన్వీనర్ ఎం.అప్పారావు, ఎడిషినల్ జీపీ బలగ సత్యం, వై.వసంతకుమారి, ఎం.రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

జోరుగా పన్నుల చెల్లింపు


సౌకర్య కేంద్రం వద్ద పన్ను చెల్లింపుదారులు

జ్ఞానాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో 2025-26 సంవత్సరానికి ఇంటిపన్ను, ఖాళీస్థలాలపై ఏప్రిల్ 30లోగా పన్ను చెల్లించే వారికి 5 శాతం రిబేటును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో చెల్లింపుదారుల నుంచి మంచి స్పందన లభించింది. జోన్-4, జోన్-5 కార్యాలయాల్లో ఉన్న సౌకర్య కేంద్రాల్లో రద్దీ కనిపించింది. సోమవారం నుంచే ఈ అవకాశం కల్పించినా సర్వర్ పని చేయకపోవడంతో మంగళవారం నుంచి చెల్లింపులు ప్రారంభించారు.

రుణమేళాకు విశేష స్పందన


జడ్పీకి దరఖాస్తు అందిస్తున్న దృశ్యం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ రాము నిరుద్యోగ యువతను కోరారు. అక్కయ్యపాలెంలోని షాదీఖానాలో మంగళవారం 41 నుంచి 55 వార్డులకు నిర్వహించిన రుణమేళాకు విశేష స్పందన లభించింది. ఆయన మాట్లాడుతూ రుణాల కోసం చాలా మంది దరఖాస్తు చేసుకున్నారని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అర్హులకు బ్యాంకుల ద్వారా అందించనున్నట్లు చెప్పారు. 1,643 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, బ్యాంకు అధికారులు, ఏపీడీ పుణ్యవతి పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు


జీఎస్ఐ కార్యాలయ సమీపంలో హైవేలో లైట్లకు రిపేరు చేస్తున్న సిబ్బంది

మాధవధార, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బాటసారులకు రాత్రి వేళ భద్రత కల్పిస్తూ విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని హైవే రోడ్లపై లైటింగ్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టారు. ముఖ్యమైన జంక్షన్లుగా ఉన్న జీఎస్ఐ, ఆర్టీఏ కార్యాలయం ఎదుట నుంచి సర్వీసు రోడ్డు వద్ద ఉన్న హైమాస్ట్ విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టారు. నిత్యం ఈ దారిలో వేలాదిగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడే ఉన్న హైవే బస్టాపు నుంచి రోడ్డు దాటుతూ పలుమార్లు చీకట్లో వాహనాల్ని గుర్తించక మలుపు ఉండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. హైవే ఆర్అండ్‌బీ జంక్షన్ నుంచి జీఎస్ఐ కార్యాలయం ఎదుట ఉన్న ఈ ప్రమాదకర ప్రాంతంలో పాత హైమాస్ట్ లైట్ స్తంభాన్ని నవీకరించారు. కొత్త లైట్లను అమర్చి, హైవే నుంచి నిత్యం మాధవధార ఉడాకాలనీ సహా సమీప ప్రాంతాలకు రోడ్డు దాటుతూ రాకపోకలు సాగించే వారికి భద్రత చేకూరుస్తూ పనులు చేపట్టారు. జీవీఎంసీ లైటింగ్ నిర్వహణ విభాగం అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనుల్ని పూర్తి చేశారు.

సీఐకి సీతంరాజు వినతి

మహారాణిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు సృష్టించకుండా వ్యాపారాలు చేసుకుంటారని, 40 మంది వ్యాపారులకు అనుమతించాలని టీడీపీ నేత సీతంరాజు సుధాకర్ వన్‌టౌన్ సీఐ జి.దేముడు బాబును కోరారు. వ్యాపారులతో కలిసి మంగళవారం సీఐ వద్దకు వెళ్లారు. పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు వన్‌టౌన్ పోలీసులు పూర్ణామార్కెట్‌లో ఆక్రమణదారులను ఖాళీ చేయించిన విషయం తెలిసిందే.

పదో తరగతి స్పాట్ కేంద్రంలో పుచ్చకాయల పంపిణీ


పుచ్చకాయ ముక్కలు అందిస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

జ్ఞానాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో జ్ఞానాపురం జూబ్లీ పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో జవాబుపత్రాలు దిద్దుతున్న 500 మంది ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు మంగళవారం పుచ్చకాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ సెలవులు కోల్పోతూ, పండుగ సంబరాలకు దూరమవుతూ, తీవ్రమైన వేడిమిని భరిస్తూ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు కొంతవరకు ఉపశమనం కలిగేందుకు వీటిని పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.ప్రేమ్‌కుమార్, సంఘం అధ్యక్షుడు అవునాపు అరుణ్‌కుమార్, కార్యదర్శి ఎంఎస్‌వీ విశ్వనాథం, సుదర్శన పట్నాయక్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాల్తేరు రైల్వే స్పోర్ట్స్ మేళా ప్రారంభం


సరదాగా బ్యాటింగ్ చేస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ వాల్తేరు డివిజన్ నిర్వహిస్తున్న డివిజనల్ అంతర్గత క్రీడలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వాల్తేరు క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా ముఖ్య అతిథిగా హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. వాల్తేరు డివిజన్‌లో ప్రతిభ గల క్రీడాకారులు వృత్తిపరంగానే కాకుండా క్రీడారంగంలో రాణిస్తూ డివిజన్ ఖ్యాతిని పెంచుతున్నారని డీఆర్ఎం ప్రశంసించారు. ఏటా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మేళా ఉద్యోగులలో స్ఫూర్తిని, అంకిత భావాన్ని పెంచుతుందని అభిప్రాయపడ్డారు. అంతర్గత క్రీడా పోటీలు నిర్వహిస్తున్న అతి కొద్ది డివిజన్లలో వాల్తేరు రైల్వే ఒకటి కావడం విశేషమన్నారు. ఈ మేళాలో మహిళా ఉద్యోగులు కూడా ప్రాతినిధ్యం వహించడం ఆనందదాయకమన్నారు. నెలాఖరు వరకు జరిగే మేళాలో వాల్తేరు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల ఉద్యోగులు 16 క్రీడాంశాలలో పాల్గొంటాయన్నారు. మేళా ప్రారంభ సూచికగా డీఆర్ఎం లలిత్ బొహ్రా కొద్దిసేపు క్రికెట్ ఆడి (బ్యాటింగ్) ఉద్యోగులను ఉత్సాహపరిచారు. క్రికెట్ మ్యాచ్‌ను డీఆర్ఎం ప్రారంభించారు. ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇ.శాంతారామ్, స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్స్ ఆఫీసర్ అవినాష్, ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు. తొలిరోజు జరిగిన క్రికెట్ టోర్నీలో ఆర్పీఎఫ్ 50 పరుగుల తేడాతో కమర్షియల్‌పై, ఎలక్ట్రికల్ (ఆపరేషన్స్) ఆరు వికెట్ల తేడాతో ఎలక్ట్రికల్ (ఈఎల్ఎస్)పై గెలుపొందాయి.

పెంచిన గ్యాస్ ధర ఉపసంహరించుకోవాలి: సీపీఎం



సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న సీపీఎం శ్రేణులు

సీతమ్మధార, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌బండపై పెంచిన రూ.50 తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. కమిటీ సభ్యురాలు, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న పేదలపై ఇది మరింత భారమని అన్నారు. కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా మంగళవారం మహిళలు తలపై గ్యాస్ సిలిండర్లు పెట్టుకొని స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మోదీ ప్రభుత్వం గ్యాస్ ధర పెంచినా రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించకపోవడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు నాయుడు ఉచిత మూడు గ్యాస్ సిలెండర్లు పథకం చాలా మంది పేదలకు అందటం లేదని ఆరోపించారు.

పట్టాలు రిజిస్ట్రేషన్ చేయరేం?

పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లకు రెవెన్యూ అధికారులు పట్టాలు మంజురు చేయాలని, 2015-2017 సంవత్సరాల్లో కేటాయించిన స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, బొట్టా ఈశ్వరమ్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మద్దిలపాలెం, కంచరపాలెం జోన్ కమిటీల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ భూములు, పోరంబోకు స్థలాలు, కొండవాలు, మురికివాడలు, రైల్వే, పోర్టు తదితర ప్రభుత్వ రంగ సంస్థల జాగాల్లో పాకలు, రేకుల షెడ్లు వేసుకొని మూడు దశాబ్దాలుగా జీవిస్తున్న వారికి ప్రభుత్వం శాశ్వత పట్టా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వివాదాస్పద స్థలాల్లో నివసిస్తున్నవారికి ప్రభుత్వమే పరిష్కారం చూపి పట్టాలు మంజురు చేయాలన్నారు. ప్రభుత్వం మారిన ప్రతిసారీ పట్టాల కోసం దరఖాస్తు చేసుకోవాలనడం సరైన విధానం కాదని, రిజిస్ట్రేషన్ చేస్తే ఈ సమస్య తలెత్తదన్నారు. అనంతరం తమ డిమాండ్లపై అర్బన్ తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మద్దిలపాలెం జోన్ కమిటీ కార్యదర్శి వి.కృష్ణారావు, సభ్యులు పి.వెంకటరావు, కె.కుమారి, కంచరపాలెం జోన్ కమిటీ సభ్యులు యూఎస్ఎన్ రాజు, జి.అప్పలరాజు పాల్గొన్నారు.

విశ్వనాథ్ అడ్వంచర్ స్పోర్ట్స్‌లో భద్రత శూన్యం

... 5వ పేజీ తరువాయి

గుర్రై పక్కన రహదారిపైకి తుళ్లిపడ్డారన్నారు. ఆ ఘటనలో తన మనుమరాలు 45 రోజులు చికిత్స తీసుకుందని, వెన్నెముక సమస్య కూడా వచ్చిందన్నారు. ఇలాగే అక్కడికి వెళ్లిన చాలామంది పిల్లలకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. తాజా ఘటనకు వస్తే...పిల్లలు నీటిలో ఆడుకునే దగ్గర ఏదైనా జరిగితే కాపాడడానికి సంరక్షకులను ఉంచాలని, అటువంటి కనీస చర్యలు కూడా వారు చేపట్టకపోవడం విచారకరమన్నారు. జిల్లా కలెక్టర్‌కు దీనిపై ఫిర్యాదు చేశానన్నారు. ఏ అనుమతులతో వాటిని నిర్వహిస్తున్నారో తెలుసుకోవాలని, భద్రత చర్యలు కూడా చూడాలని, లేనిపక్షంలో దానిని మూసివేసి, పిల్లల ప్రాణాలు కాపాడాలని ఆయన కోరారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విహార యాత్ర పేరిట పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌కి వస్తున్న తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఏయూ విద్యార్థి నాయకుడు, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ కోరారు. తల్లిదండ్రులు పక్కన లేకుండా చిన్నారులను ఈతకొలనులోకి పంపవద్దన్నారు. ఈతకొలనులో ఏడేళ్ల బాలుడు మృతి చెందడం విచారకరమన్నారు. ఈ సంఘటనకు విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని హేమంతకుమార్ డిమాండ్ చేశారు.

కి'లేడీ'

... 5వ పేజీ తరువాయి

దేవీరావు అనే మహిళ ఇంటిని అద్దెకు తీసుకుంది. ఆమెకు గేదెల సన్యాసప్పుడు అనే సహాయకుడు ఉండేవాడు. అతడితో కలిసి తక్కువ ధరకు స్థలాలు ఇస్తానంటూ ఆమె ప్రచారం చేసుకుంది. ఈ మేరకు భూములకు చెందిన నకిలీ డాక్యుమెంట్లు చూపించింది. ఆమె మాటలను నమ్మిన తరుణ్‌కుమార్ 2021, 2023 మధ్య కాలంలో ఆఫ్ లైన్, ఆన్‌లైన్‌లలో రూ.15 లక్షలు చెల్లించాడు. గత ఏడాది ఏడాది జనవరి ఒకటో తేదీన ఎంవీపీ కాలనీ టీటీడీ సర్కిల్ సమీపానున్న ఆదాయపు పన్ను శాఖ కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద కొంత సొమ్ము ముట్టజెప్పాడు. అయినప్పటికీ స్థలం రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో, తన డబ్బులు వెనక్కి ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో తన సొమ్ము రూ.100 కోట్లు సీబీఐ ఆధీనంలో ఉండిపోయిందని, అది విడుదలైన తర్వాత సొమ్ముకు రెట్టింపు ఇస్తానని, మరో రూ.3 లక్షలు ఇవ్వాలని అడిగింది. దీంతో తనను మోసం చేసిందని గ్రహించిన తరుణ్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా దేవీరావు పెందుర్తిలోని ఎం.సతీష్ అనే వ్యక్తి నుంచి, తగరపువలసలో వెంకటలక్ష్మి, మద్దిలపాలెం వాసి శ్యామ్‌కుమార్ నుంచి కూడా కొంత మొత్తాన్ని వసూలు చేసినట్టు బయటపడింది. దీంతో ఆమె బాధితులు మరింత మంది ఉండవచ్చునని భావించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖాకీ వసూల్

... 5వ పేజీ తరువాయి

తప్పవని హెచ్చరిస్తూవస్తున్నారు. అయితే పోలీస్ కమిషనరేట్‌లో కొంతమంది మధ్యస్థాయి అధికారులు రాజకీయ పలుకుబడితో పోస్టింగ్‌లు దక్కించుకున్నారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల అండదండలు తమకు పుష్కలంగా ఉన్నాయంటూ కిందిస్థాయి అధికారులు, సిబ్బంది దగ్గర గొప్పగా చెప్పుకుంటూ పరోక్షంగా వసూళ్లకు వారిని ప్రోత్సహించడం మొదలుపెట్టారు. ముందుగా ట్రాఫిక్ విభాగంలో కొందరు అధికారులు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు, వ్యాపారులతో, తర్వాత క్రైమ్ విభాగంలోని కొందరు అధికారులు స్క్రాప్ వ్యాపారులతో అవగాహన కుదుర్చుకున్నట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది. తాజాగా శాంతి భద్రతల విభాగం పోలీసులు కూడా వసూళ్లపై దృష్టిసారించారని, అందులో భాగంగానే మద్యం దుకాణాలు, బార్‌ల నుంచి నెలవారీ మామూళ్లు పెట్టుకున్నారని ఆరోపిస్తున్నారు. నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 142 మద్యం దుకాణాలు, 117 బార్‌లు ఉన్నాయి. గతంలో ప్రైవేటు మద్యం దుకాణాలు ఉన్నప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు నెలవారీ మామూళ్లు అందేవి. జనరల్ కానిస్టేబుల్ వాటిని వసూలుచేసి స్టేషన్ అధికారికి అందజేసేవారు. వైసీపీ హయాంలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించడంతో మామూళ్లు నిలిచిపోయాయి. కేవలం బార్‌ల నుంచి మాత్రమే నెలవారీ మామూళ్లు కొనసాగేవి. సీపీగా శంఖబ్రతబాగ్చి బాధ్యతలు చేపట్టిన తర్వాత బార్‌ల నుంచి కూడా మామూళ్లను పోలీసులు నిలిపివేశారు. అయితే నగర పోలీస్ కమిషనరేట్‌లో ఇటీవల పోస్టింగ్‌లు పొందిన కొంతమంది మధ్యస్థాయి అధికారులు...మద్యం వ్యాపారుల నుంచి నెలవారీ మామూళ్లు తిరిగి ప్రారంభించాలని తమ కిందిస్థాయిలోని ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు. ఎక్కడైనా బయటకు వచ్చినా దానిని సీపీ దృష్టికి చేరకుండా తమ స్థాయిలోనే ఏదో ఒకటి చెప్పి సర్దుబాటు చేస్తామని భరోసా ఇచ్చినట్టు సమాచారం. దీంతో గతనెల నుంచి దాదాపు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ మద్యం దుకాణాలు, బార్‌ల నుంచి నెలవారీ వసూళ్ల ప్రక్రియ ప్రారంభించేశారు.

మద్యం దుకాణానికి రూ.5 వేల నుంచి రూ.ఎనిమిది వేలు

ప్రతి మద్యం దుకాణం వద్దకు సంబంధిత సీఐలు కొన్నాళ్ల కిందట పెట్రోలింగ్ పేరుతో ప్రత్యక్షంగా వెళ్లారు. దుకాణాల వద్ద పాటించాల్సిన జాగ్రత్తలు, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎదురయ్యే ఇబ్బందులను వారికి వివరించారు. తర్వాత సిండికేట్‌ల ద్వారా వ్యాపారులు సంప్రతింపులు చేసి నెలవారీ మామూళ్లపై అవగాహనకు వచ్చినట్టు చెబుతున్నారు. దుకాణంలో విక్రయాల స్థాయిని బట్టి నెలకు రూ.ఐదు వేల నుంచి రూ.ఎనిమిది వేల వరకు నెలవారీ మామూళ్లు నిర్ణయించారు. అలాగే బార్‌ల వద్ద రౌడీషీటర్లు, ఆకతాయిలు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని వ్యాపారులను బెదిరించి వారి నుంచి నెలకు రూ.7,500 నుంచి రూ.పది వేల వరకు మామూళ్లు తీసుకుంటున్నారు. కొన్ని దుకాణాల్లో వ్యాపారం ఆశాజనకంగా లేనప్పటికీ పోలీసులతో తలనొప్పి ఎందుకనే భావనతో అడిగినంత ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఇదికాకుండా నగరంలో ఎక్కడైనా దాడులు నిర్వహించే అధికారం కలిగిన ప్రత్యేక విభాగం మద్యం దుకాణం నుంచి రూ.రెండు వేలు, బార్ నుంచి రూ.ఐదు వేలు చొప్పున వసూలు చేస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. దీనిపై పోలీస్ శాఖలోని మధ్యస్థాయి అధికారులకు పూర్తిసమాచారం ఉన్నప్పటికీ తమకు వాటాలు వస్తుండడంతో ఈ విషయాన్ని సీపీ దృష్టికి చేరకుండా చూస్తున్నారంటున్నారు.

మండుటెండలో ప్రయాణికులు విలవిల

» ప్రధాన కూడళ్లలో బస్ షెల్టర్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు » కార్యరూపం దాల్చని అధికారుల ప్రతిపాదనలు

గాజువాక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండుటెండలో విలవిల్లాడుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని పలువురు ప్రయాణికులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షెల్టర్లు లేక ఎండలో బస్సుల కోసం నిరీక్షిస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడం దారుణమని మండిపడుతున్నారు. గాజువాక ప్రాంతంలో నిత్యం రద్దీగా ఉండే పాత గాజువాక జంక్షన్ వద్ద అనకాపల్లి మార్గంలో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండ వేడిమికి తాళలేకల నానా పాట్లు పడుతున్నారు. పాత గాజువాక కేంద్రంగా స్టీల్ ప్లాంట్, పరవాడ, అనకాపల్లి, తదితర ప్రాంతాలకు వెళ్లేవారు, వివిధ కర్మాగారాల్లో పనిచేసే కార్మికులు, కళాశాలలు, పాఠశాలలకు ఇతర ప్రాంతాలకు ఈ బస్టాప్ నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈ బస్టాప్ నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆరేళ్ల క్రితం నాలుగు బస్ షెల్టర్లను ఇక్కడ ఏర్పాటు చేశారు. అయితే అక్కడున్న వ్యాపార సంస్థలకు అవి అడ్డంగా ఉన్నాయంటూ రాత్రికి రాత్రే వాటిని తొలగించారు. అయినప్పటికీ ఆర్టీసీ, జీవీఎంసీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఈ తొలగింపు వెనక భారీ మొత్తంలో ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

ఇదిలావుండగా పాత గాజువాక జంక్షన్ వద్ద సింధియా వైపు వెళ్లే మార్గంలో గల బస్ షెల్టర్‌ను కూడా రాత్రికి రాత్రే తొలగించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రముఖ కూడళ్లలో బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాలని స్థానిక కళాశాలల విద్యార్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఎండల్లో, వానల్లో బస్సుల కోసం ఆయా స్టాప్‌ల వద్ద వేచివుండే దుస్థితి నెలకొంది. కాగా వేసవికి ముందే పారిశ్రామిక ప్రాంతంలోని కీలక కూడళ్లలో బస్ షెల్టర్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. కానీ ఇప్పటివరకు అవి కార్యరూపం దాల్చకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు బస్ షెల్టర్ల ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆశిద్దాం.





పాత గాజువాక జంక్షన్‌లో బస్సుల కోసం మండుటెండలో వేచివున్న ప్రయాణికులు

పెందుర్తి ఆస్పత్రిలో నేత్ర వైద్యం కరువాయె..

» ఏడాదిగా నిలిచిపోయిన సేవలు

» దృష్టి లోపాలతో వచ్చే వారిని విమ్స్‌కు పంపిస్తున్న సీహెచ్‌సీ సిబ్బంది

పెందుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటారు.. ప్రపంచాన్ని చూపగలిగేవి కళ్లు మాత్రమే. బాల్యం నుంచే 'దృష్టి'పై జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతారు. ఏ రోగం వచ్చినా ఇక్కడి నిరుపేదలు ముందుగా చూసేది పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) వైపే. సుమారు రెండు లక్షల జనాభాకు వైద్య సేవలందించే సీహెచ్‌సీలో ఏడాదిగా నేత్ర వైద్యులు లేరు. దీంతో కంటి సమస్యలు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు కంటి వైద్య పరీక్షల కోసం పెందుర్తి వచ్చేవారు. నేత్ర వైద్య సేవలు ఏడాదిగా లేకపోవడంతో ప్రజలు నిట్టూరుస్తున్నారు. నేత్ర వైద్య పరీక్షల కోసం ఎవరైనా వస్తే విమ్స్ ఆస్పత్రి, శంకర్ ఫౌండేషన్‌కు వెళ్లాలని ఇక్కడి సిబ్బంది సూచిస్తున్నారు. గతంలో చంద్రన్న, వైఎస్సార్ కంటి వెలుగు పథకాల పేరుతో పెందుర్తిలో నేత్ర వైద్య సేవలు అందేవి. అంధత్వ నివారణలో భాగంగా ఇక్కడ చికిత్సలు చేసి అవసరమైన వారికి శస్త్ర చికిత్సల నిమిత్తం ప్రాంతీయ కంటి ఆస్పత్రికి పంపేవారు. అన్ని కంటి పరీక్షలు ఉచితంగా లభించడంతో రోజుకు సగటున 40 మంది వచ్చేవారు. ప్రస్తుతం ఇక్కడ నేత్ర వైద్యసేవలు అందకపోవడంతో పేదలు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పీపీపీ పద్ధతిలో అపోలో ఆస్పత్రి టెలీ హెల్త్ సెంటర్ ద్వారా నేత్ర వైద్య సౌకర్యం కల్పించేది. ఈ కాంట్రాక్టు ముగియడంతో సేవలు నిలిచిపోయాయని సీహెచ్‌సీ వైద్యులు పేర్కొంటున్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు చొరవ చూపి సీహెచ్‌సీలో నేత్ర వైద్యుడిని నియమిస్తే ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.



సీహెచ్‌సీలో మూతపడిన నేత్ర వైద్యుని గది

భెల్‌లో హయ్యర్ పెన్షన్‌ను అమలు చేయాలని ఎంపీకి వినతి

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీలో హయ్యర్ పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు కృషి చేయాలని కోరుతూ మంగళవారం నగరంలో ఎంపీ శ్రీభరత్‌కు భెల్ గుర్తింపు కార్మిక సంఘ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. దేశంలోని అన్ని భెల్ యూనిట్లలో హయ్యర్ పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నా, ఇక్కడ ఆ విధానం లేకపోవడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. అలాగే సంస్థలో 1991లో చేరిన ఆర్-సిరీస్ కార్మికుల రెగ్యులర్ సమయంలో జాయినింగ్ తేదీల నమోదులో చోటుచేసుకున్న పొరపాట్ల వల్ల పలువురు కార్మికులు పీఎఫ్, పింఛన్ విషయంలో నష్టపోతున్నారన్నారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని భరత్ హామీ ఇచ్చినట్టు కార్మిక నాయకులు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు శుభాకర్ సాహు, కొల్లి దేముడు, పీవీఎన్ రాజు, బాబూరావు, బి.రవీంద్ర బాబు, టీఎల్ నరసింగరావు, తదితరులు ఉన్నారు.



శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న భెల్ హెచ్‌పీవీపీ గుర్తింపు కార్మిక సంఘ నాయకులు

ఎంపీకి 'సీ' ప్రతినిధుల కృతజ్ఞతలు

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం (సీ) ప్రతినిధులు, పెన్షన్ వారియర్స్ మంగళవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో శ్రీభరత్‌ను కలిశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఈపీఎఫ్-95 అధిక పెన్షన్ పొందడంలో ఎంపీ చేసిన కృషికి కతజ్ఞతలు తెలిపారు. అలాగే స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు సకాలంలో జీతాలివ్వడం లేదని, పెండింగ్ వేతనాలను త్వరితగతిన ఇచ్చేందుకు కృషి చేయాలని, కాంట్రాక్టు కార్మికులను తొలగించకుండా చూడాలని ఎంపీని కోరారు. శ్రీభరత్‌ను కలిసిన వారిలో 'సీ' ప్రతినిధులు చంద్రరావు, ద్వారం స్వామి, శ్రీనివాస్, వెంకటరావు, తదితరులు ఉన్నారు.

కార్పొరేషన్ల ద్వారా అర్హులందరికీ రుణాలు | జీవీఎంసీ జోన్-5 కమిషనర్ రాము

మల్కాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా అర్హులందరికీ రుణాలు మంజూరు చేసి వారి జీవనోపాధికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పడుతుందని జీవీఎంసీ జోన్-5 కమిషనర్ రాము అన్నారు. మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన రుణ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ఐదేళ్లలో ఇటువంటి అవకాశాలు లేవని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో 982 మంది దరఖాస్తు చేసుకోగా, ఈ మేళాకు 578 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. అందరి దరఖాస్తులను బ్యాంకులకు పంపుతామని, వాటి ద్వారా రుణాలు అందుతాయని జడ్సీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీడీవో కృపానందం, కార్పొరేటర్ గల్లా చిన్న, టీడీపీ నాయకులు మజ్జి సోమేశ్, కాకి పోలిరెడ్డి, మాతా శ్రీను, నీలాపు జోగి, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మల్కాపురంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్సీ రాము

గాజువాకలో దరఖాస్తుల పరిశీలన

గాజువాక: వివిధ కార్పొరేషన్ల కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి దరఖాస్తులను పరిశీలించారు. జోనల్ కమిషనర్ శేషాద్రి ఆధ్వర్యంలో యూజీడీ సిబ్బంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఆధార్, కుల, విద్యార్హత పత్రాలను స్వీకరించారు. వ్యాపార వివరాలను దరఖాస్తు రూపంలో అధికారులు తీసుకున్నారు.



వేపగుంటలో అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలిస్తున్న దృశ్యం

రుణ మేళాకు అనూహ్య స్పందన

వేపగుంట: వెనకబడిన తరగతుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న రుణ మేళాను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనర్ కె.హైమావతి కోరారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన రుణ మేళాకు అనూహ్య స్పందన వచ్చింది. లభించింది. జోన్-8 పరిధి పశ్చిమ నియోజవకర్గంలో 669 దరఖాస్తు చేసుకోగా 540 మంది, పెందుర్తి నియోజకవర్గ పరిధిలో 1,071 దరఖాస్తు చేసుకోగా 992 మంది ఈ మేళాకు హాజరైనట్టు ఏపీడీ చిరంజీవి తెలిపారు. సీవోలు వాసు జగదీశ్వరి, ఎస్వీ రమణ, మహాలక్ష్మి, సబలకుమారి, మురళీకుమారి, కనకమహాలక్ష్మి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్ఐను దుర్భాషలాడిన వ్యక్తి అరెస్టు

గాజువాక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకున్న సివిల్ సప్లై ఆర్ఐతో దుర్భాషలాడిన వ్యాపారిని గాజువాక పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. గాజువాకకు చెందిన వి.కృష్ణమూర్తి అనే వ్యక్తి ఈ నెల 2న రేషన్ బియ్యాన్ని వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్నాడనే సమాచారంతో సివిల్ సప్లై ఆర్ఐ పద్మావతి గాజువాకలో పట్టుకున్నారు. ఆ సమయంలో ఆమెతో అసభ్యకరంగా మాట్లాడడంతో పాటు దుర్భాషలాడాడు. ఆర్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కృష్ణమూర్తిని అరెస్టు చేశారు. కాగా కృష్ణమూర్తిపై అక్రమ బియ్యం తరలింపుపై గతంలో తొమ్మిది కేసులున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే పంచకర్ల క్రికెట్ టోర్నీ ప్రారంభం

పెందుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురంలో పైడితల్లమ్మ పండగ సందర్భంగా జనసేన నాయకుడు పిళ్లా జగన్మోహనపాత్రుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పంచకర్ల క్రికెట్ కప్ టోర్నమెంటును మంగళవారం ప్రారంభించారు. టీడీపీ జిల్లా యువజన అధ్యక్షుడు పీవీఎస్ఎన్ బుచ్చిరాజు, జగన్మోహనపాత్రుడు సంయుక్తంగా ఈ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు చీర గణేశ్, నాగరాజు, డి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

30లోగా ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక వార్షికానికి సంబంధించి ఆస్తి పన్ను, ఖాళీ జాగా పన్నులను ఈ నెల 30లోగా చెల్లించి 5 శాతం రాయితీ పొందవచ్చని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ మునిసిపల్ కార్పొరేషన్ల చట్టం 1955, సెక్షన్ 265(3) అనుసరించి, ఆస్తి పన్ను డిమాండ్ నోటీసు సర్వీస్‌తో సంబంధం లేకుండా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ జాగా పన్నులను 30వ తేదీ లోగా చెల్లించి 5 శాతం రాయితీ (ఎర్లీ బర్డ్ ఆఫర్)ని ఆస్తిపన్నుదారులు పొందవచ్చన్నారు. నగరవాసులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఆస్తి పన్నుల చెల్లింపులకు సంబంధించి ప్రజల సౌకర్యార్థం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల సౌకర్యం కేంద్రం, అన్ని జోనల్ కార్యాలయాల్లో సౌకర్యం కేంద్రాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 8 గంటల వరకు పని చేస్తాయని, సెలవు రోజులైన ఆదివారాలు కూడా సౌకర్యం కేంద్రాలు పని చేస్తాయని హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పెదగంట్యాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పెంటమాంబ ఉత్సవాల్లో భాగంగా ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఉత్సవాల ప్రారంభం నుంచి ప్రతిరోజూ రాత్రిపూట నెల్లిముక్కులోని వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం జ్యోతి కూచిపూడి నృత్యాలయం వారు భరతనాట్యాన్ని, నెల్లిముక్కు కాలనీ మహిళలు కోలాటాన్ని ప్రదర్శించారు. ఈ నెల 15వరకు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని నిర్వాహక కమిటీ ప్రతినిధులు తెలిపారు.



శేష వాహనంపై ఉభయ దేవేరులతో శ్రీవారు

శేష వాహనంపై వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి రాజులపాలెంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి 25వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో త్రిశక్తి ఆలయం నుంచి మహిళలు ఊరేగింపుగా కలశాలతో విచ్చేసి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి పంచామృతాభిషేకాలు జరిపారు. అనంతరం శోభాయమానంగా అలంకరించి శేష వాహనంపై ఉత్సవ విగ్రహాలను అధిష్ఠింపజేసి పురవీధుల్లో కోలాటాల నడుమ ఊరేగించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీతారాములకు పూజలు

ఆటోనగర్: జీవీఎంసీ 70వ వార్డు పరిధి డ్రైవర్స్ కాలనీలోని శ్రీరామ మందిరంలో ఏకాదశిని పురస్కరించుకుని దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో అర్చకులు సోమేశ్వరశర్మ సీతారాములకు ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. ఈవో శ్రీనివాసరావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు కేవీఎస్ శంకరరావు, నాయకులు పీబీఎల్ మూర్తి, లంకల మురళీదేవి, శ్రీకాంత్, రమేశ్, చిరంజీవి, కృష్ణంరాజు, శివ, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎస్.ఎ.డి.జంక్షన్ ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 90వ వార్డు పరిధి ఇందిరా ప్రియదర్శిని కాలనీలో రూ.19.90 లక్షలతో చేపడుతున్న రహదారి, కాలువ పనులకు మంగళవారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో మౌలిక వసుతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సోమేశ్, పైడిరాజు, ఎ.కిశోర్, మాణిక్యం, అబ్దుల్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ప్రారంభం

అగనంపూడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి జంక్షన్‌లో స్థానిక సద్భావన సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని సంస్థ ప్రధాన కార్యదర్శి జి.పూర్ణానందశర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని దీనిని ఏర్పాటు చేశామన్నారు.

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్‌లో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర ప్రారంభించారు. కుల సంఘాలు సమాజ సంక్షేమానికి కూడా కృషి చేయాలన్నారు.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్** : జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్లికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్** : జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా** : శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 28, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 34, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 15, క్యారెట్ 36 దొండకాయలు 24, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, అల్లం (పాతది)48, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 120, మునక్కాడలు (కిలో) 24, బద్దచిక్కుడు 62, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 24, క్యాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28 చిలగడదుంపలు 40, కంద 60, దేముడుచిక్కుడు 60, గోరుచిక్కుడు 32, బ్రకోలి 45, కూరపెండలం 26, నూల్‌కోల్ 32, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 55, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ ధ్యేయం

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

ఎస్.ఎ.డి.జంక్షన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలనే ధ్యేయంతోనే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. జోన్-8 పరిధిలోని 89, 90, 91, 92 వార్డుల్లో ఇళ్ల పన్నులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఇంటి పన్నుల మేళా పేరుతో బాజీ జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం ప్రజాదర్బార్ నిర్వహించి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిపన్నుల హెచ్చుతగ్గులు, పేర్ల మార్పు, గతంలో పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తిలో పాతవారి పేర్లు, కొంతమందికి గతంలో ప్రభుత్వం పట్టా ఇచ్చినా నంబర్లు లేనివారికి ఏం చేయాలి, గతంలో ఇచ్చిన ప్రభుత్వ జీవోలు ఆధారంగా వారికి ఎటువంటి ప్రయోజనం జరుగుతుందనే అంశాలపై అధికారులకు, ప్రజలకు అవగాహన కల్పించి సమస్య పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. త్వరలో ఇటువంటి సమస్యల పరిష్కారానికి రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసి జఠిల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సుమారు 300 దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో జడ్సీ కె.హైమావతి, కార్పొరేటర్ బొమ్మిడి రమణ; స్థానిక నాయకులు ఎ.ప్రసాద్; ఎ.కోటేశ్వరరావు, ఎన్.సోములు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెందుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్స్‌పాల్ లలితకుమారి తెలిపారు. పదో తరగతి ఫలితాలతో సంబంధం లేకుండా ఉత్తీర్ణులవుతామని ధీమా ఉన్న విద్యార్థులు ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నేపథ్యంలో కళాశాలలో శత శాతం సీట్ల భర్తీ కోసం అధ్యాపక సిబ్బంది ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా మంచి విద్యా ప్రమాణాలతో బోధన జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. కళాశాలలో గల వసతులు, మధ్యాహ్న భోజన పథకం, బ్రిడ్జ్ కోర్సు, ఉచితంగా పాఠ్య పుస్తకాల పంపిణీ తదితర సదుపాయాల గురించి తెలియజేస్తున్నారు. ఎలాగైనా శత శాతం సీట్ల భర్తీకి చర్యలు చేపడుతున్నామని లలితకుమారి పేర్కొన్నారు. కాగా ఈ నెల ఒకటి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రారంభమైన తరగతులు 23వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

87వ వార్డులో జడ్సీ, కార్పొరేటర్ పర్యటన

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి, కణితిల్లో మంగళవారం జోనల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి, ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్, కార్పొరేటర్ బొండా జగన్‌లు పర్యటించారు. ఈ సందర్భంగా ఎంవీవీఎంకే పార్కులో సుమారు రెండు వేల మంది నివాసితులు వినియోగిస్తున్న వ్యర్థాలను వడ్లపూడి గెడ్డ వైపు వదేస్తుండడంతో తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు జడ్సీ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వారు ఎంవీవీఎంకే లేఅవుట్‌ను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పారిశుధ్య సమస్యలపై ఆయా ప్రాంతాల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, ఎం.రాము, కృష్ణ, అప్పారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని సీపీఎం ఆందోళన

గాజువాక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జీవో నంబర్లు 296, 288ల ద్వారా ఇచ్చిన ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని, జీవో నంబర్-30 ద్వారా అర్హులందరికీ ఇళ్ల పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గాజువాక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజాప్రతినిధులు నెరవేర్చాలన్నారు. గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేస్తామన్న హామీని తక్షణమే అమలులోకి తేవాలని కోరారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు డి.రమణ, ఎ.లోకేశ్, బంగారునాయుడు, సంతోషం, కిరీటం, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, జీవో 296, 388 ప్రకారం ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని, గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ ఇవ్వాలని కోరుతూ ములగాడ మండల కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడులు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు పాలనలో 296, 388 జీవోల ప్రకారం ఇళ్ల పట్టాలు పొందినా అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయకపోవడం వల్ల రిజిస్ట్రేషన్లు చేయించుకోలేకపోతున్నారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా చంద్రబాబే ఉన్నందున దీనిపై దృష్టిసారించి రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలని కోరారు. అనంతరం తహసీల్దార్ భుజంగరావు ఆందోళనకారులను ఉద్దేశించి మాట్లాడుతూ జీవో నంబర్-30 ప్రకారం 2019 అక్టోబర్ ముందు ఎవరైతే ప్రభుత్వ స్థలంలో ఇళ్లు కట్టుకున్నారో వారందరూ పట్టాల కోసం దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి పట్టాలు మంజూరు చేస్తామన్నారు. అలాగే గ్యాస్ సిలెండర్ల రాయితీ డబ్బులు బ్యాంక్ అకౌంట్లలో పడేలా చూడాలని సివిల్ సప్లయ్ అధికారులకు సూచించామన్నారు. సీపీఎం నాయకులు పి.పైడిరాజు, ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, ఎస్.శ్రీనివాసరావు, పీ.రామారావు, కె.రమణ, ఆర్.విమల, పీ.వరలక్ష్మి, బి.జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశిమాంబ పండగ



అగనంపూడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, ఉక్కు నిర్వాసిత ప్రాంతాల ఆరాధ్య దేవత పరదేశిమాంబ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు అమ్మవారి ఆలయం వద్ద బారులుతీరారు. అమ్మవారికి భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించి ఆలయం వద్దకు తీసుకువచ్చాక అనుపోత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు చిత్తా గణేశ్, బి.నాగేశ్వరరావు, చిత్తా కనకరాజు, గల్లా రాజు, ఎం.నరసింగరావు, జి.శ్రీను, సత్యారావు, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం

జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొత్తపాలెం గ్రామస్థుల ఇలవేల్పు దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గమాంబకు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు మధ్యాహ్నం అన్న సమారాధనను చేపడుతున్నామన్నారు. సాయంత్రం ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

'అర్హులకు టిడ్కో ఇళ్లను ఇవ్వాలి'

మల్కాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం శివారు అచ్చినాయుడు తోట కొండల మధ్య నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను సీపీఐ నాయకులు మంగళవారం పరిశీలించారు. అచ్చినాయుడు తోటలో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయినా ఇంకా అర్హులకు అందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే వీటిని నిర్మించారని, అప్పటి కలెక్టర్ చేతుల మీదుగా ఇళ్ల పట్టాలను కూడా అందజేశారన్నారు. అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల గురించే పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం మళ్లీ చంద్రబాబే సీఎంగా ఉన్నందున అర్హులందరికీ టిడ్కో ఇళ్లను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పశ్చిమ నియోజకవర్గ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ, నాయకులు గుడాల రాంబాబు, ఎస్వీ త్రినాథ్, కనకేశ్వరరావు, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో భాగంగా నిర్వహించిన అప్పన్న రథోత్సవంలో పాల్గొన్న భక్త జనం



కల్యాణోత్సవానికి హాజరైన భీమిలి, పశ్చిమ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు తదితరులు



మాంగల్యధారణ చేస్తున్న అర్చకులు

నేత్రపర్వంగా అప్పన్న తిరు కల్యాణ మహోత్సవం

వాద సంవాదాల నడుమ సందడిగా ఎదురు సన్నాహం

- మాడవీధుల్లో సంప్రదాయబద్ధంగా రథోత్సవం
- హరినామ స్మరణతో మార్మోగిన సింహగిరి
- భక్తులకు ముత్యాల తలంబ్రాల పంపిణీ

సింహాచలం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): **ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం సింహాచలం వరాహలక్ష్మీనృసింహుని వార్షిక తిరుకల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తుల హరినామ స్మరణ నడుమ కల్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఏటా చైత్రమాస శుక్లపక్ష దశమి నుంచి వారం రోజుల పాటు స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈనెల 7న అంకురార్పణంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.**

మంగళవారం వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, ప్రభాత ఆరాధనలు పూర్తిచేసి విశేష హోమాలు, బాలభోగ నివేదన, గ్రామ బలిహరణం చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆస్థాన మండపంలో కొట్నాల ఉత్సవం నిర్వహించారు. ముత్తైదువులు రోకలితో పసుపుకొమ్ములను దంచారు. ఉత్సవంలో ఈవో కె.సుబ్బారావు సతీమణి, మహిళలు పాల్గొన్నారు. అనంతరం యాగశాలలో అగ్ని ప్రతిష్ఠాపన చేసి విశేష హోమాలు చేపట్టారు.

దేవతాహ్వానం..

భువిలో మానవులతో నిర్వహించే అప్పన్న వార్షిక తిరుకల్యాణ మహోత్సవానికి దివిలోని ముక్కోటి దేవతలకు ఆహ్వానంగా ధ్వజారోహణం చేపట్టారు. గరుడ చిత్తరువు పటానికి పూజలు చేసి, అష్ట దిక్పాలకులకు గరుడ గద్యలు, డోలు వాయిద్యంతో పాటలు పాడారు. ప్రధానాలయ ముఖద్వారం వద్ద గల ధ్వజస్తంభానికి గరుడ ధ్వజాన్ని ఎగురవేసి దేవతలను ఆహ్వానించారు.

ఆనందోత్సాహాల మధ్య ఎదురు సన్నాహం

కల్యాణోత్సవంలో ముఖ్యమైన ఎదురు సన్నాహోత్సవాన్ని రాత్రి 6.30 గంటలకు ప్రారంభించారు. బంగారు తొళక్కినియాన్‌లో ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ముత్యాల పల్లకిలో భూదేవి, నీలాదేవి అమ్మవార్లను అధిష్ఠింపజేసి మాడవీధిలో జోడుభద్రాల వద్ద ఏర్పాటు చేసిన వేదికపై ఉంచి వాద, సంవాదాలతో వేడుక నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారి గోత్రనామాలు, ప్రవరలు, రుషులు, గుణ గణాలు వివరించి వివాహానికి అంగీకరింప చేసి లగ్న పత్రికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పుష్పమాలికల మార్పిడి ఘట్టాన్ని నాద వాయిద్యానికి అనువుగా నర్తిస్తూ ఆవిష్కరించిన తీరు ఆకట్టుకుంది.

సందడిగా రథోత్సవం

ఎదురుసన్నాహం అనంతరం దేవేరులతో స్వామివారిని రాజగోపురం ఎదురుగా నిలిపి శోభాయమానంగా తీర్చిదిద్దిన రథంలో అధిష్ఠింపజేసి విశేష అలంకరణలు చేశారు. రథానికి కొబ్బరికాయ కొట్టి తొలిపూజ చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. భక్తుల హరినామ స్మరణల నడుమ రథసారథి జాలరికుల పెద్ద కదరి లక్ష్మణరావు ఆదేశాల మేరకు రథాన్ని ఈవో కొమ్ముల సుబ్బారావు, భక్తులు లాగారు. మాడవీధుల్లో రథయాత్ర నేత్రపర్వంగా సాగింది. కళాకారుల పులివేషాలు, తప్పెటగుళ్ల విశేష శోభను చేకూర్చాయి.



రథోత్సవంలో పూజలందుకుంటున్న స్వామివారు



అబ్బురపరిచిన కళాకారుల ప్రదర్శనలు

అంగరంగ వైభవంగా కల్యాణం

రథయాత్ర అనంతరం నృసింహ మండపం మధ్యలో వివిధ రకాల పుష్పాలతో ఆలయ నమూనాలో తీర్చిదిద్దిన ప్రత్యేక కల్యాణ వేదికపైకి స్వామి, అమ్మవార్లను తొడ్కొని వచ్చారు. స్థానాచార్యులు డా.టీడీపీ రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు ఏవీ రమణాచార్యులు, గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహితులు కరి సీతారామాచార్యులు విష్వక్సేనారాధనతో వార్షిక తిరుకల్యాణమహోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ముడుకలశాలను ఉంచి పుణ్యాహవాచనము జరిపిన పవిత్ర జలాలతో కల్యాణవేదికను, సంబారాలను, భక్తులు, అతిథులు, ఆలయ సిబ్బందిని ప్రోక్షణ గావించారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు చేసిన తర్వాత నూతన వధూవరులకు మధుపర్కాలను సమర్పించారు. శుభముహూర్తవేళ స్వామి, అమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ఉంచారు. మాంగళ్య దేవతలకు షోడశోపచారలతో పూజలు చేసి, లక్ష్మీ అష్టోత్తర శతనామావళితో అర్చించారు. భక్తుల గోవిందనామ స్మరణలు, ముక్కోటి దేవతల ఆశీర్వచనాల నడుమ మాంగళ్యధారణ గావించారు. ముత్యాలు కలిపిన తలంబ్రాలతో అక్షతారోపణం చేపట్టారు. అనంతరం ప్రత్యేక కౌంటర్లలో ముత్యాల తలంబ్రాలను, లడ్డూ ప్రసాదాలను విక్రయించారు. గోపాలపట్నం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వచ్ఛంద సంస్థలు భక్తులకు సేవలందించాయి. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది.

అప్పన్న కల్యాణోత్సవంలో నేడు

వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 9న బుధవారం జరగనున్న కార్యక్రమాలు ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు, ఉదయం 5 నుంచి 7.30 గంటల వరకు విశేష హోమాలు, బాలభోగ నివేదన, గ్రామ బలిహరణము, 7.30 గంటలకు మంగళాశాసనము. అనంతరం 11.30 గంటల వరకు భక్తులకు సర్వదర్శనాలు, 12.30గంటల వరకు మహారాజభోగం, స్వామివారి దర్శనాలు లభించవు. సాయంత్రం 5 గంటలకు శేషవాహనంపై సింహగిరి మాడవీధుల్లో తిరువీధి, రాత్రి 7 గంటలకు ఆరాధన, విశేష హోమాలు, పది గంటలకు నివేదన, గ్రామ బలిహరణము, మంగళాశాసనము, పవళింపు సేవ, కవాట బంధనం.



ఎదురుసన్నాహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



అమ్మవార్ల వేషధారణతో అలరించిన కళాకారులు



విద్యుత్ దీపాలతో వెలుగులీనుతున్న సింహాచలంలోని ప్రధాన గోపురం

వాడపల్లికి ఆర్టీసీ వీక్లీ స్పెషల్స్

ద్వారకాబస్‌స్టేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి వాడపల్లి వెంకటేశ్వరాలయానికి ఆర్టీసీ వీక్లీ స్పెషల్స్ నడపనుంది. ఈ బస్సులు ప్రతి శనివారం తెల్లవారుజామున 4 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి ఉదయం 9.30 గంటలకు వాడపల్లి చేరుకుంటాయి. భక్తులు ఆలయ ప్రదక్షిణలు, స్వామి దర్శనాలు చేసుకున్న అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు బయలుదేరి రాత్రి 9 గంటలకు విశాఖ చేరుకుంటాయి. భక్తులకు వాడపల్లి ఆలయ నిర్వహణ కమిటీ మధ్యాహ్నభోజన సదుపాయాన్ని కల్పిస్తుందని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. ఈ బస్సుల్లో ప్రయాణానికి రూ.వెయ్యి చార్జీగా నిర్ణయించామన్నారు. ఆర్టీసీ ఆన్‌లైన్, ఆథరైజ్డ్ ఏజెన్సీల నుంచి, ద్వారకాకాంప్లెక్సులోని రిజర్వేషన్ కౌంటర్లలోనూ టికెట్లు బుక్‌చేసుకోవచ్చునని, వివరాలకు 9959225602, 9959225594 నంబర్లలో సంప్రతించాలన్నారు.

పెంచిన వంట గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలి

- జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఐ వినూత్న నిరసన

సిరిపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను తక్షణమే రద్దుచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ళ పైడిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. గ్యాస్ సిలిండర్ మోయలేనిభారంగా ఉందంటూ, కట్టెల పొయ్యిపై టీ చేసి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహావసరాలకు వినియోగించే సిలిండర్‌పై రూ.50 చొప్పున పెంచడం వలన పేద ప్రజలపై మరింత భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెంపుతో సాధారణ వినియోగదారులు, ఉజ్వల లబ్ధిదారులు ఇక్కట్లు ఎదుర్కొంటారన్నారు. కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై భారం వేయడం అన్యాయమన్నారు. తక్షణమే పెంచిన ధరలను రద్దుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు వి.విమల, రెహమాన్, చంద్రశేఖర్, మన్మథరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



కట్టెలపొయ్యిపై టీ కాచి నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

తక్కువ ధరకు బంగారం పేరుతో మోసం

- రూ.12 లక్షలు కాజేసిన కర్నూలు వాసి

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): 'నా దగ్గర కొంత బంగారం ఉంది. తక్కువ ధరకు అమ్మేస్తున్నాను.' అంటూ నకిలీ బంగారం అంటగట్టి నగరవాసి నుంచి రూ.12 లక్షలు తీసుకుని ఉడాయించాడో యువకుడు. బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఇందుకు సంబంధించి ఎంవీపీ ఎస్‌ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని కేఆర్‌ఎం కాలనీకి చెందిన కొయిలాడ ప్రసాద్‌రావు ఇటీవల రాజమండ్రి వెళ్లారు. అక్కడ ఉన్న మూడు రోజుల్లో ర్యాపిడో డ్రైవర్ ఎం.బాలు పరిచయమయ్యాడు. ప్రసాద్ విశాఖ వచ్చిన తర్వాత బాలు ఫోన్ చేసి, తన వద్ద కొంత బంగారం ఉందని, ఆర్థిక సమస్యల వల్ల అమ్మేద్దామని అనుకుంటున్నట్టు చెప్పాడు. విశాఖ రమ్మని ప్రసాద్ కోరడంతో కొంత బంగారంతో వచ్చాడు. బంగారం మంచిదేనని ధ్రువీకరించుకున్న ప్రసాద్ అడ్వాన్సుగా రూ.50 వేలు చెల్లించాడు. దీంతో తాను తెచ్చిన బంగారంతో సహా బాలు తన స్వస్థలం కర్నూలు అని చెప్పి వెళ్లిపోయాడు. ఆ తరువాత సొమ్ము పలుమార్లు ఫోన్ చేయడంతో, ప్రసాదరావు తన బంగారాన్ని తాకట్టు పెట్టి మరీ రూ.11.5 లక్షలు సిద్ధం చేశారు. తాను అనారోగ్యంతో ఉన్నానని, విశాఖ వచ్చే పరిస్థితి లేదని, మీరే కర్నూలు వచ్చి బంగారం తీసుకువెళ్లాలని చెప్పడంతో మార్చి 22న ప్రసాదరావు తన తల్లి, సోదరితో కలసి కర్నూలు వెళ్లి బైపాస్ రోడ్డు వద్ద ఎం.బాలు, మరో వ్యక్తిని కలిశారు. సొమ్ము ఇచ్చి, బంగారం తీసుకుని చూడగా నకిలీదిగా గుర్తించారు. దీనిపై ప్రశ్నిస్తుండగా ప్రసాదరావును బాలు తోసేసి, డబ్బుతో సహా పరారయ్యాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

కబ్జా ఆరోపణలపై ప్రహరీ తొలగింపు



1200 గజాల స్థలంలో నిర్మించిన ప్రహరీని తొలగిస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఐదో వార్డు అయోధ్యనగర్‌లోని ఫారెస్ట్ లేఅవుట్, లచ్చిరాజులేఅవుట్ మధ్య ఓపెన్‌స్పేస్‌లోని కొంతస్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి ప్రహరీ నిర్మించారనే విమర్శల నేపథ్యంలో జోన్-2 టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం ప్రహరీని తొలగించారు. ఐదో వార్డు అయోధ్యనగర్‌లో లచ్చిరాజు లేఅవుట్ పేరుతో ఎల్‌పీ నంబరు 67/87తో అప్పటి వుడా లేఅవుట్ వేసింది. దానికి ఆనుకుని ఫారెస్ట్ లేఅవుట్ పేరుతో ఎల్‌పీ నంబరు 8/1996తో మరొక లేఅవుట్‌వేసింది. రెండు లేఅవుట్‌లకు 2.45 ఎకరాలను ఓపెన్‌స్పేస్‌గా కేటాయించింది. అందులో సుమారు 1,200 గజాల స్థలానికి ప్రైవేటు వ్యక్తి ప్రహరీ నిర్మించారని చెబుతున్నారు. అయితే టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్మాణం ఆపాలని ఆదేశించినా వినకపోవడంతో మంగళవారం రెండుసార్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు వెళ్లి ప్రహరీని తొలగించాయి. కాగా ఆ స్థలం తనదని, డాక్యుమెంట్లున్నాయని, నోటీసు ఇవ్వకుండా తొలగించడంపై న్యాయ పోరాటం చేస్తానని రమేష్ అనే వ్యక్తి పేర్కొనడం విశేషం.

నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

- యాజమాన్యం దిగి వచ్చే వరకు పోరాటాలు తప్పవని స్పష్టీకరణ

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికులు ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మెకు సంసిద్ధులవుతున్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపుపై సోమవారం రాత్రి ఆర్‌ఎల్‌సీ కార్యాలయంలో ఉక్కు యాజమాన్యం, కార్మిక నాయకుల మధ్య జరిగిన చర్చల్లో పురోగతి లేదని కార్మిక నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంటులో సుమారు 12 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 1,503 మందిని గత నెల 31న తొలగించారు. మార్చి 31 నాటికి 30 శాతం తొలగించాలని యాజమాన్యం భావించింది. గతంలో 2,400 మందిని తొలగించడంపై తీవ్రస్థాయిలో ఆందోళనకు దిగడంతో నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. తాజాగా టెండర్లు పూర్తయిన కాంట్రాక్టర్లకు పునరుద్ధరించకపోవడంతో ఏడు వందల మంది కార్మికులు విధులకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, సమ్మె చేసినా మరో 1,503 మందిని తొలగించింది. దీంతో కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతున్నారు.

ఒక్క కార్మికుడ్నీ తొలగించరాదు

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియను యాజమాన్యం విరమించుకోవాలి. సంస్థ ప్రగతిలో వారి శ్రమ వెలకట్టలేనిది. ఉన్నఫలంగా తప్పించడంతో కుటుంబం రోడ్డున పడుతుంది. మానవత్వంతో ఆలోచించి న్యాయం చేయాలి.

- కె.వంశీకృష్ణ, ఉక్కు కాంట్రాక్టు కార్మిక నాయకుడు



క్రైం... crime news

112 కేజీల గంజాయి స్వాధీనం

- అల్లూరి జిల్లాకు చెందిన ముగ్గురి అరెస్టు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆటోలో అనకాపల్లి నుంచి గాజువాకకు తరలిస్తున్న 112 కేజీల గంజాయిని అగనంపూడి టోల్‌గేటు వద్ద పట్టుకున్నామని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ తెలిపారు. ఈ మేర కు మంగళవారం దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం మందీబా గ్రామానికి చెందిన కిముడు హనుమాన్, మాడుగుల సమీపంలోని నక్కమెట్టకి చెందిన బసురిపాల్ దినకర్, మరో బాలికతో కలిసి ఆటోలో గంజాయి తరలిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రావడంతో వారు దువ్వాడ పోలీసులను అలర్ట్ చేశారన్నారు. దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అగనంపూడి టోల్‌గేటు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులు బైక్, ఆటోను వెనక్కి తిప్పడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆటోలో నాలుగు గోనె సంచులలో 50 గంజాయి ప్యాకెట్లు పట్టుబడ్డాయని తెలిపారు. గంజాయి తరలిస్తున్న హనుమాన్, దినకర్‌లను అరెస్టు చేసి, బాలికను జువనైల్ హోమ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



గంజాయి ప్యాకెట్లను చూపిస్తున్న ఏసీపీ టి.త్రినాథ్, సీఐ మల్లేశ్వరరావు

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని 5.3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్ ఎస్‌ఐ కీర్తిరెడ్డి, జీఆర్పీ ఎస్‌ఐ రామారావు తనిఖీలు నిర్వహిస్తుండగా తమిళనాడుకు చెందిన పాండియన్ చెన్నైకు గంజాయి రవాణా చేస్తూ దొరికిపోయాడు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని రైల్వే పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



శ్రీను (ఫైల్)

తగరపువలస, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన తగరపువలస శ్రీనగర్ కాలనీలో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కాలనీలోని ఎం. శ్రీను (65) మేడమీద ఆరబెట్టిన దుస్తులను తీయడానికి వెళ్లి, అక్కడ వేలాడుతున్న విద్యుత్ తీగెలు తగలడంతో తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. మేడకు పిట్ట గోడ లేనందువల్ల కింద పడిపోయి తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. క్షతగాత్రుడ్ని వెంటనే 108 వాహనంలో నగరంలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. శ్రీను భార్య కాసులమ్మ ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి మృతిపై నివేదికకు ఆదేశం

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథ్ స్పోర్ట్స్‌లో బాలుడు మృతిచెందిన ఘటనపై పోలీసులు, జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత సంస్థ ప్రతినిధులు తక్షణమే నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. బాలుడి మృతికి తమ కమిషన్ సంతాపం తెలుపుతున్నట్టు చెప్పారు. వాటర్ వరల్డ్ యాజమాన్యం భద్రతా ప్రమాణాలు సరిగా పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇటువంటి సంస్థలు నగరంలో ఇంకా ఎన్ని ఉన్నాయి? ఇప్పటికే శిక్షణ పొందుతున్న పిల్లల వివరాలు, ముందుముందు ఎలాంటి భద్రతా ప్రమాణాలు అమలు చేయబోతున్నారనే సమాచారంతో నివేదిక అందజేయాలని సూచించామన్నారు.